

సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229




ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 33 ఎడిటర్ : పాలగోని రాజేష్ శుక్రవారం 25 ఏప్రిల్ -2025 పేజీలు : 8 వెల : 4-00



## ఉగ్రవాదులకు ప్రధాని మోదీ

# స్ట్రాంగ్ వార్నింగ్

- ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా వెతికి శిక్షిస్తాం
- వారికి మద్దతు ఇస్తున్న వారిని సైతం వదలబోం
- వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- బీహర్ పర్యటనలో ప్రధాని మోడీ ఘాటు హెచ్చరిక

పట్నా,ఏప్రిల్24
ఉగ్రవాది ఎక్కడ నక్కినా సరే వెతికి మరీ శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠిన శిక్ష విధిస్తామన్నారు. ఇది భారతీయ ఆత్మపై జరిగిన దాడి అని ప్రధాని అభివర్ణించారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లిచుకోక తప్పదన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బిహార్‌లోని మధుబనిలో ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలో ఉగ్రదాడి గురించి ఆయన ప్రస్తావిస్తూ.. ముష్కరులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం దాడి గురించి ప్రధాని స్పందించారు. వారు భారత్ ఆత్మపై దాడి చేసే దుస్సాహసం చేశారు. ప్రపంచానికి మేము చెప్పేది ఒక్కటే.. ఉగ్రవాదులను, వారికి సాయమందించిన వారందరికీ గుర్తించి శిక్షిస్తాము. భూమి అంచుల వరకూ వారిని వెంటాడి పట్టుకుంటాము. ఉగ్రవాదంతో భారత్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయలేరని మోదీ నిప్పులు చెరిగారు.

3

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన

# స్వర్ణయుగం

- -గ్రామస్వరాజ్యం కోసం గాంధీ కలలను నిజం చేసాం
- -ఉద్యమ కలను సాకారం చేసిన కెసిఆర్
- -ఎక్స్‌లో పోస్ట్ చేసిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



3

హైదరాబాద్,ఏప్రిల్24
తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు.

## భారత్‌తో మేమూ

# కటీఫ్

**ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం సైన్యం అందుకు సన్నద్ధంగా ఉంది ప్రకటించిన ఇస్లామాబాద్**

ఇస్లామాబాద్,ఏప్రిల్24
భారత్‌తో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టు పాకిస్తాన్ నేషనల్ సెక్యూరిటీ కమిటీ ప్రకటించింది. పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఇండియాకు స్పష్టంగా చెప్పినా తమ దేశంపై చర్యలకు సిద్ధమవుతోందని తెలిపింది. తాము కూడా అంతే ధీటు-గా సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నట్టు- ప్రకటించింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైన్యం సిద్ధంగా ఉందని తెలిపింది. తక్షణం సైన్యానికి సెలవులు రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది.



4

## నేడు ఢిల్లీకి వెళ్లనున్న సిఎం చంద్రబాబు

**మరోమారు ప్రధాని మోడీతో భేటీ**



3

## గ్రామాలు స్వయం ప్రతిపత్తి

# సాధించాలి

- గాంధీ మహాత్ముడి ఆశయం కూడా అదే
- పంచాయితీ నిధులు వాటికే ఖర్చు చేస్తున్నాం
- జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవంలో డిప్యూటి సిఎం పవన్

3

అమరావతి,ఏప్రిల్24 :
గ్రామాలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలుగా ఏర్పడాలని గాంధీజీ చెప్పేవారని, తాను నగరాల్లో ఉన్నా.. పల్లెల్లో ఉండాలనే కోరిక ఉండేదని డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పల్లెల అభివృద్ధి ఎంతో కీలకం అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులు వాటికే ఖర్చు చేయాలని చెప్పానని.. అలాగే అమలు చేస్తున్నానని అన్నారు. ఈ విషయంలో తనకు సహాయ సహకారాలు అందిస్తున్న శశిభూషణ్, కృష్ణ తేజ , ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ



పంచాయతీ రాజ్ దినోత్సవ సభ గురువారం అమరావతి లోని సికె కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిని చూపిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు.



## రాష్ట్రంలో రెడ్ బుక్

# రాజ్యాంగం

- -డైవర్షన్ పాలిటిక్స్‌లో ఆరితేరారు-అవినీతి మితిమీరిపోయింది
- -అప్పనంగా విశాఖలో భూముల పందేరం
- -తెగువ చూపిన వైఎస్సార్ కార్యకర్తలకు సెల్యూట్- బాబు సింగిల్ డిజిట్‌కు రాక తప్పదు
- -ప్రజాప్రతినిధుల భేటీలో జగన్ కీలక వ్యాఖ్యలు

5

అమరావతి,ఏప్రిల్24
: ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. యుద్ధ వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారు. దుర్మార్గమైన రెడ్‌బుక్ పాలన జరుగుతోందని వైఎస్ జగన్ మండిపడ్డారు. ప్రజావ్యతిరేకతను అణచివేయడం సాధ్యం కాదన్న ఆయన.. మేనిఫెస్టో అమలు చేయకపోతే ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిలదీస్తాడని చెప్పారు. బలం లేకపోయినా స్థానిక సంస్థల్లో టీడీపీ పోటీ చేస్తోంది. ప్రజలు ఓడించారు కాబట్టే.. చంద్రబాబు తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని విడిచిపెట్టి కుప్పం వెళ్లిపోయాడు. అక్కడ బీసీలు ఉన్నారు.. వారు ఆర్థికంగా ఇతరత్రా బలంగా ఉండరు కాబట్టి, వారిని తొక్కితొక్కిపెట్టవచ్చని చంద్రబాబు కుప్పంలో పాగావేశారని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

# ఉగ్రదాడిపై సోకాల్డ్ సెక్యులరిస్టులు మాట్లాడరేం

- రాహుల్ విదేశాలకు వెళ్లినప్పడల్లా ఏదో అలజడి
- మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శలు




3

# సంపాదకీయం

## ఉగ్రవాదుల ఏరివేతకు కాశ్మీర్‌ను జల్లెడ పట్టాలి !

గురువారం 24-4-2025

పర్యాటక స్వర్గధామం అయిన జమ్మూ కాశ్మీర్‌లో నరమేథం సృష్టించడం ద్వారా అక్కడ సాధారణ పరిస్థితులు రాకుండా...సామాన్య జనం అక్కడ లేకుండా..ముఖ్యంగా హిందువులను లేకుండా చేయాలన్న ముస్లిం ఉగ్రవాదుల కుట్రలో భాగమే తాజా నరమేధానికి నిదర్శనం. 370 ఆర్టికల్ రద్దు తరవాత కాశ్మీర్ అభివృద్ధి చెంది, పర్యాటకంగా పునరుత్తేజం పొందడాన్ని ఉగ్రవాదులు, వారికి సహకరిస్తున్న పాక్ జీర్ణించుకోవడం లేదు. ఈ దాడిని ముందే పసిగట్టడంలో కూడా భద్రతాబలగాలు విఫలం అయ్యారు. ఇకపోతే ఇదొక అనుభవంగా, గుణపాఠంగా కాశ్మీర్‌ను మొత్తం మిలిటరీకి అప్పగించాలి. శ్రీలంకలో ఈలం అన్నది లేకుండా చేసేందుకు సైనిక చర్య చేపట్టి విజయం సాధించారు. అనేక దేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు జరిగాయి. ఇప్పుడు కాశ్మీర్‌లో జల్లెడ్ పట్టాలి. అణువణువు పరిశీలించాలి.. అక్కడి స్థానికులను రక్షిస్తూనే... కొత్తగా వస్తున్న వారిపై నిఘా పెంచాలి. జల్లెలడ పట్టాలి. లెఫ్ట్ తీవ్రవాదం కన్నా ఇస్లామిక్ తీవ్రవాదం చాలా ప్రమాదకరం. మావోయిస్టులను ఏరివేసే పనిని పక్కన పెట్టి కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులను ఏరివేసే కార్యక్రమాలను ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో పాక్‌తో సరిహద్దుల్లో భద్రత పటిష్టం చేయాలి. అలాగే ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేథానికి శిక్షణ ఇస్తున్న శిబిరాలను లేపేయాలి. అవసరమైతే పాక్ ఆక్మిత కాశ్మీర్‌ను విలీనం చేసుకోవాలి. అందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. భారత్ అంటే బలమేమిటో సత్తా చాటి పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాలి. మాటలతో పాక్ దారికి రాదు. దానికి గట్టిగా ఉద్ది చెప్పేందుకు సైనిక చర్యకు దిగాలి. 2008లో ముంబై దాడి తర్వాత సివిలియన్లపై జరిగిన రెండో అతిపెద్ద ఉగ్రదాడి ఇదే. జమ్మూ కాశ్మీర్ ప్రాంతం పాకిస్తానీ తీవ్రవాదులకు ఇంకా నిలయంగానే ఉందని ఈ సంఘటన చెపుతున్నది. ఉగ్రసంస్థ మతపరమైన లక్ష్యాలను సాధించడానికి లేదా ఒక నిర్దిష్ట మత సమూహానికి వ్యతిరేకంగా దాడులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరిగిన సంఘటన ఈ రకమైనదే. తహావూర్ హుస్సేన్ రాణాను అమెరికా భారత్‌కు అప్పగించిన తర్వాత దేశంలో ఉగ్రవాద చర్యలు జరిగే అవకాశం ఉందనే సమాచారం కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ ముందుగానే తెలిపింది. అయితే, కేంద్రం, జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సున్నిత పర్యాటక ప్రాంతమైన జమ్మూలో ముందుగానే కేంద్ర, రాష్ట్ర బలగాలను అప్రమత్తం చేయడంలో కొంత విఫలమైనట్టు ఒప్పుకోవాలి. ఇప్పటికైనా పర్యాటకులకు ఆటంకం లేకుండా నిరంతర గస్తీని పెంచాలి. బలగాలను ప్రతి గ్రామంలోనూ మొహరించాలి. ప్రపంచంలో ఇస్లామిక్ ఉగ్రవాదం భయంకరమైనదిగా నరరమేథం సృష్టిస్తోంది. దీనిని ప్రపంచ ముస్లింలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాలే చర్యలకు పూనుకోవాలి. జమ్మూకాశ్మీర్లో మతపరమైన లక్ష్యాలు సాధించేందుకు ఉగ్రదాడులు జరుగుతున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్ట్ గ్రూపులు అయిన లష్కర్ -ఏ -తోయిబా, జైష్ -ఏ -మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలు ఈ దాడులు చేస్తున్నాయి. వీరిని ఏరివేసేందుకు ఎలాంటి మీనమేషాలు లెక్కించరాదు. ఎంత కఠినమైన పనయినా వీరిని కలుపు మొక్కల్లా ఏరిపారేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఉగ్రవాదాన్ని అణచివేసే శక్తి లేకుపోవడం వల్ల కేంద్ర మిలిటరీ వ్యవస్థ జమ్మూకాశ్మీర్ ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. పాక్ తన కుయుక్తులను కేవలం ఉగ్రదాడులకే ఉపయోగిస్తోంది. పాక్‌ను ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మడం కాదు...దానిని అన్ని రకాలుగా నిర్వీర్యం చేయాలి. ఇప్పటికే అనేక మారణహోమాలు సాగాయి. ఇలాగే మిన్నకుంటే మరిన్ని దాడులు జరుగుతాయి. భారత్‌పై కన్నేస్తే అంతే సంగతులు అన్నట్లుగా పరిస్థితులు మారాలి. ఇజ్రాయిల్ తరహా శిక్షణతో సైన్యాన్ని రాటుదేలించాలి. పాక్‌ను ప్రపంచంతో వేరు చేసే అన్ని చర్యలు తీసుకోవాలి. అలాగే భారత్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడాలి. ఈ క్రమంలో ఇలాంటి టెర్రరిస్టుల దాడులను తీవ్రంగా తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉంది. తాజా దాడిలో ప్రత్యేకంగా హిందూవర్గంవారిని గుర్తించి మరీ కాల్పులు జరపడం అందరూ ఆలోచించా ల్సిన విషయం. పహల్గాంలో జరిగిన సంఘటనలో బాధితుల ముందు తీవ్రవాదులు చేసిన వ్యాఖ్యలు అత్యంత అమానవీయమైనవి. దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు వారి వ్యాఖ్యల్లో కనిపిస్తున్నాయి. గత మూడేళ్లుగా కాశ్మీర్ పర్యాటక రంగం పుంజుకుంది. కాశ్మీరీలకు ఉపాధి అవకాశాలు బాగా పెరిగాయి. ఈ తీవ్రవాదులు చేసిన మతాధార మారణకాండ..పుంజుకుంటున్న కాశ్మీర్ ఆర్థిక పరిస్థితిని తిరిగి దెబ్బతీసే అవకాశం ఉంది. అలాగే కాశ్మీర్ పర్యాటక రంగం మళ్లీ దెబ్బతింటే, అది కాశ్మీరీల ఉపాధిపైన తీవ్రమైన ప్రభావం చూపనుంది. ఈ క్రమంలో కేంద్రం తీసుకున్న కొన్ని చర్యలు సమర్థనీయమైనవే. పాక్ పౌరులకు భారత్‌లోకి నో ఎంట్రీ సార్క్ వీసాలన్నీ రద్దుచేయడాన్ని స్వాగితించాల్సిందే. 28మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడమే కాకుండా ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వారు లేదా, ఆ దేశంతో సంబంధాలున్న స్థానిక ఉగ్రవాదులుగా నిర్థారణ అయిన నేపథ్యంలో భారత్ ఈ దాడిని తీవ్రంగా పరిగణించింది. సౌదీ అరేబియా పర్యటనను అర్ధంతరంగా కుదించుకుని బుధవారం ఉదయం భారత్ తిరిగివచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఉదయంనుంచి కశ్మీర్‌లో పరిస్థితిపైన ఎడతెరిపి లేకుండా కేంద్రమంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సాయంత్రం ప్రధాని మోడీ అధ్యక్షతన అత్యవసరంగా సమావేశమైన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సంచలన నిర్ణయాలు తీసుకొంది. సార్క్ ఒడంబడికలో భాగంగా సభ్యదేశమైన పాకిస్థాన్ పౌరులకు జారీచేసిన వీసాలన్నిటినీ రద్దు చేస్తున్నట్లు, ఈ వీసాలున్న పాకిస్థాన్ పౌరులు 48గంటల్లోగా భారత్‌ను వదిలి వెళ్లాలని, ఆ దేశ పౌరులను దేశంలోకి అనుమతించేది లేదని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇప్పటికే సరిహద్దు దాటిన పాక్ పౌరులు మే 1లోగా తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటారీ వాఘా వద్ద ఇరుదేశాల సరిహద్దుల్లో ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టునుసైతం తక్షణం మూసి వేయాలని నిర్ణయించింది. పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతును నిలిపివేసే దాకా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపి వేయాలని కూడా సమావేశం నిర్ణయించింది. 1960లో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సింధు నదితో పాటుగా దాని ఉపనదుల ద్వారా పాక్‌లోని లక్షలాది ఎకరాలకు సాగు నీటితో పాటు పలు ప్రాంతాలకు తాగు నీరు లభిస్తుంది. మన దేశంలోని పాక్ దౌత్య కార్యాలయంలో ఉన్న రక్షణ లేదా, మిలిటరీ సలహాదారులను వెనక్కి పంపించి వేయాలని నిర్ణయించింది. అలాగే పాక్‌లోని మన దౌత్యకార్యాలయంలో ఉన్న ఈ సలహాదారులను కూడా వెనక్కి పిలిపిస్తారు. మే 1నుంచి మొత్తంమీద ఇరు దేశాల హైకమిషన్ కార్యాలయాల్లో సిబ్బందిని ఇప్పుడున్న 55నుంచి 30 కి కుదించాలని నిర్ణయించారు. ఇవ చేస్తూనే కాశ్మీర్‌ను మిలిటరీ కేంద్రంగా మార్చాలి. అక్కడ నిరంతర నిఘా పెంచాలి. ఉగ్రవాదుల ఏరివేతకు జల్లెడ పట్టాలి.

# ధాన్యం కొనుగోళ్లలో తిరకాసులు

### రైతులను నిండా ముంచుతున్న మిల్లర్లు

ఖమ్మం,ఏప్రిల్24

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తరుగు విషయంలో కొందరు మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతుంది. రైతుల నుంచి ధాన్యం సేకరణ సమయంలో ఎలాంటి తరుగు తీయొద్దని మంత్రులు, కలెక్టర్సహా అధికారులు స్పష్టంగా చెబుతున్నా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. రెండు, మూడు రోజులుగా క్వింటాకు 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, మిల్లు దగ్గరకు లోడ్ వచ్చినా తరుగు తీస్తేనే అన్‌లోడ్ చేసుకునేందుకు ఒప్పుకుంటామని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మిల్లర్లకు భయం కలగడం లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ సీజన్ లో 1.85 లక్షల టన్నుల సన్న ధాన్యం, 73 వేల టన్నుల దొడ్డు రకం ధాన్యం కలిపి మొత్తం 2.58 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 1,317 మంది రైతుల నుంచి రూ. 24.66 కోట్ల విలువైన 10,628.760 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 8,900 టన్నుల సన్న రకం ధాన్యం కాగా, మిగతాది దొడ్డు రకం ధాన్యమని అధికారులు చెబుతున్నారు. రైస్ మిల్లుల దగ్గర, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు లేకుండా పర్యవేక్షణ జరుపుతున్నామని ఒకవైపు ఆఫీసర్లు చెబుతున్నా, తరుగు తీస్తేనే కాంటాలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించేందుకు సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉండడం లేదు. మరికొన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో లేని కారణంగా ఇప్పటి వరకు కాంటాలు ప్రారంభం కాలేదు. కారేపల్లి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో మాదారం, సొసైటీ- ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు- చేశారు. విశ్వనాథపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి కొందరు రైతులు మూడు రోజుల కిందనే ధాన్యం తీసుకొచ్చారు. బస్తాలు లేకపోవడంతో నిర్వాహకులు కొనుగోలు ప్రారంభించలేదు. కారేపల్లి సొసైటీ- సిబ్బంది 20 రోజుల కిందనే జిల్లా సివిల్ స్లపై అధికారికి బస్తాలు కావాలని ఇండెంట్ కూడా పెట్టారు. ఇప్పటి వరకు బస్తాలు రాలేదు. గన్నీ బస్తాల కొరతతో కొనుగోలు ప్రారంభించకపోవడంతో కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇకపోతే కొనుగోలు కేంద్రాల్లో తరుగు విషయంలో మిల్లర్లు ఇబ్బంది పెడుతుండడంతో బాధిత రైతులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు మిల్లర్లు కూడా తమ పరిస్థితిని సమర్థించుకుంటున్నారు. తాము క్వింటాకు 67 కిలోల బియ్యాన్ని లేవీగా ఇవ్వాల్సి ఉంటుందని, ఈ సీజన్ లో పండిన ధాన్యాన్ని మర ఆడిస్తే 60 కిలోలు మాత్రం బియ్యం వస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కువ వేడి కారణంగా బియ్యం నూకగా మారడంతో తాము నష్టపోతున్నామని, ధాన్యం తరుగు తీస్తేనే తమకు గిట్టుబాటు- అవుతుందని అంటున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో ఎప్పుడు వాన కురుస్తుందోనన్న భయం ఉండగా, కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించకపోవడంతో వాటిపై పట్టాలు కప్పి అక్కడే నిల్వ ఉంచారు.

# ట్రంప్ నిర్ణయానికి కోర్టులో చుక్కెదురు



### స్వల్ప కారణాలతో విద్యార్థుల వీసాల రద్దు

### వాటిని పునరుద్ధరిస్తూ న్యాయస్థానం ఆదేశాలు

వాషింగ్టన్,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ): వీసాల రద్దుతో ఇబ్బంది పడ్డ భారత్ విద్యార్థులకు ఊరట దక్కింది. వీరితో పాటు పలుదేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమెరికాలో ట్రంప్ కార్యవర్గం 133 మంది విద్యార్థులకు నిలిపేసిన ఎస్ఈవీఐఎస్ అంటే స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను న్యాయస్థానం పునరుద్ధరించింది. దీనిలో అధిక మంది భారత్‌కు చెందినవారున్నారు. అమెరికా విదేశాంగశాఖ వీరి వీసాలను రద్దు చేయడంతోపాటు ఎస్ఈవీఐఎస్‌ను టెర్మినేట్ చేయడంపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అమెరికాలో చాలామంది భారతీయులు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ అంటే ఓటిపి కింద ఉన్నారు. దీంతో వారికి తాత్కాలికంగా పనిచేసే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా స్టెమ్ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారికి ఈ అవకాశం లభిస్తుంది. దాదాపు 36 నెలల పాటు- అక్కడ పని చేయవచ్చు. ఈ సమయాన్ని వారు హెచ్-1బీ వర్క్ వీసా వంటివి సాధించేందుకు వారధిగా వాడుకొంటారు. ఓపీటీ- స్టేటస్ పోతే అమెరికాలో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. మరోవైపు అక్కడి ప్రభుత్వ ఏజెన్సీల వాదన భిన్నంగా ఉంది. ఈ విద్యార్థులు పలు సందర్భాల్లో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టిలోపడ్డారని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో తాము తాత్కాలికంగా అడ్డుకొనేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చెబుతున్నాయి. కానీ, ఈ విద్యార్థులకు ఎటువంటి నేర చరిత్ర లేదు. ఇక ఇమిగ్రేషన్ లాయర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయం సరికాదని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఏ తీవ్ర నేరాలు చేయకపోయినా.. వారి లీగల్ స్టేటస్‌లను తొలగించారన్నారు. తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే విద్యార్థి వీసాలను రద్దు చేస్తున్నారని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక విద్యార్థిపై గృహహింస కేసు నమోదైందని వీసా రద్దు చేశారు. తాజాగా రద్దయిన 327 మందిలో కేవలం ఇద్దరు మాత్రమే స్వల్ప రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసలు అమెరికా విదేశాంగ శాఖ వీసాలను రద్దు చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని లాయర్లు పేర్కొంటు-న్నారు. 'క్యాచ్ అండ్ రివోక్' పేరిట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో విద్యార్థి వీసా ఉన్నవారి పరిస్థితిని ఏఐ టూల్స్‌తో సమీక్షిస్తారు. చివరికి వారి సోషల్ మీడియాను కూడా పరిశీలిస్తారు. ఈ ప్రోగ్రామ్ కింద దాదాపు 300 మంది విద్యార్థుల వీసాలు రద్దయ్యాయి. వీరిలో సగం మంది భారతీయులు, చైనీయులు, నేపాలీలు, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్ వాసులున్నారు.

## అమరావతిలో చురుకుగా ప్రధాని సభ ఏర్పాట్లు

-మరోమారు అధికారులతో కలసి పరిశీలించిన మంత్రి

-ప్రధాని రాకతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

అమరావతి,ఏప్రిల్24

: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే2వ తేదీన రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. గురువారం సభ ఏర్పాటు చేసే వేదికను మంత్రి నారాయణ, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి రాజధాని పనులు పునః ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు. మే 2వ తేదీన మోదీ రాకకు ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా 8 రోడ్డులను పోలీస్ అధికారులు గుర్తించారని.. ఎక్కడ ట్రాఫిక్ జామ్ నెలకొనకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. ప్రధాని సభ కోసం వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేయడానికి 11 ప్రాంతాలను గుర్తించామని మంత్రి నారాయణ తెలిపారు. వైసీపీ హయాంలో గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. కనీసం ముగ్గురు, నలుగురు అమరావతి రైతులను పిలిచి సన్మానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారని అన్నారు. ప్రధాని కేవలం గంటన్నర మాత్రమే అమరావతి పర్యటన కోసం సమయం ఇచ్చారని తెలిపారు. ప్రధాని మోదీ భద్రత దృష్ట్యా పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అదనపు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ప్రజలు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరిస్తే చేస్తామని.. లేకపోతే భూసేకరణ విషయంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో గతంలో ఒక ఎయిర్‌పోర్ట్ ఉండేదని... అయినా శంషాబాద్ నిర్మించారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఇప్పుడు రెండో ఎయిర్‌పోర్ట్ లేకపోతే పదిశాతం విమానాలు కూడా దిగేవి కావని అన్నారు. రానున్న 100 సంవత్సరాలను దృష్టిలో పెట్టు-కొని సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని ఏర్పాటు- చేస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## గోదావరి -బనకచర్లను ఆపండి

### -నదీయాజమాన్య బోర్డులకు ఇఎన్‌సి లేఖ

హైదరాబాద్,ఏప్రిల్24

గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ లేఖ రాసింది. గోదావరి - బనకచర్ల లింక్ విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని లేఖలో పేర్కొంది. ఎలాంటి అనుమతుల్లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని గతంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపామని ఈఎన్సీ వెల్లడించింది. పనులు విభజన చట్టం, -ట్రైబ్యునల్ అవార్డులకు విరుద్ధమని... తెలంగాణకు నష్టం జరుగుతుందన్న ఈఎన్సీ తెలిపింది. ఈ నెల ఏడో తేదీన జరిగిన జీఆర్ఎంబీ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించామంది. ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆ రోజు జీఆర్ఎంబీ ఛైర్మన్, ఏపీ సభ్యులు సమాధానం ఇచ్చారని తెలిపింది. కానీ, మరుసటి రోజే గోదావరి - బనకచర్ల లింక్ కోసం ఏపీ ప్రభుత్వం జలహారతి కార్పోరేషన్ ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలంగాణ ఈఎన్సీ పేర్కొంది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించి ఏపీని నిలువరించాలి. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతల పథకాలపై ఇందుకు సంబంధించిన ఎలాంటి టెండర్ల పక్రియ చేపట్టవద్దు. కృష్ణా జలాలకు సంబంధించి -ట్రైబ్యునల్ లో వాదనలు జరుగుతుండగా... జలాల మళ్లింపు కోసం ఉత్తర్వులు ఇవ్వరాదు. ఏపీ జారీ చేసిన జలహారతి కార్పోరేషన్ ఉత్తర్వులను నిలిపివేసేలా చూడాలని తెలంగాణ ఈఎన్సీ లేఖలో స్పష్టం చేసింది.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత సెర్చ్

### -ఎదురు కాల్పుల్లో జవాన్ మృతి

శ్రీనగర్,ఏప్రిల్24 జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గురువారం ఉదయం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో జవాను మరణించాడు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. జిల్లాలోని డూడు-బసంత్‌గఢ్ ప్రాంతంలో కాల్పులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందడంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దట్టమైన అడవి ప్రాంతం కావడంతో ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా శ్రమిస్తున్నారని.. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఉగ్రవాదులను ఎరివేసేందుకు బలగాలు సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు.

# చంచల్‌గూడా జైలుకు అఘోరీ శ్రీనివాస్



హైదరాబాద్,ఏప్రిల్24

: అఘోరీ శ్రీనివాస్‌ను మహిళా జైలుకు తరలించారు. ఉమెన్ ట్రాన్స్ జెండర్ కావడంతో చంచల్ గూడ మహిళా జైలుకు పోలీసులు తరలించారు. యూపీలో అరెస్ట్ చేసిన అఘోరని బుదశారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అఘోరీ ప్రస్తుతం చంచల్ గూడ మహిళా జైలులో ఉన్నారు. మరో వైపు వర్షిణిని భరోసా సెంటర్‌కు తరలించినట్లు సమాచారం. రిమాండ్ నేపథ్యంలో అఘోరి శ్రీనివాస్‌ను ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన పోలీసులు, అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఆయనను ట్రాన్స్ జెండర్ ఫీమేల్‌గా గుర్తించారు. దాంతో కంది సబ్ జైలు అధికారులు జైలులోకి ప్రవేశానికి నిరాకరించారు. దానితో పోలీసులు శ్రీనివాస్‌ను మరోసారి వైద్య పరీక్షల కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య నివేదిక ఆధారంగా ఆయనను ఏ జైలుకు తరలించాలన్న దానిపై అధికారులు నిర్ణయం తీసుకున్నారు. చంచల్ గూడ మహిళా జైలుకు తరలించారు.

## ఉగ్రవాదులకు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

పహెల్గామ్‌లోని బైసారంలో పర్యటనకు వచ్చిన టూరిస్టులను మంగళవారం నాడు ఉగ్రవాదులు కిరాతకంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది మృతి చెందారు. ఈ దాడి కుట్రదారు పాక్‌పై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ కమిటీ- పాక్‌పై పలు చర్యలకు ఉపక్రమించింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడంతో పాటు- దౌత్య పరమైన చర్యలకు ఉపక్రమించింది. పాక్‌లో భారత సాయుధదళాల సలహాదారులను వెనక్కు పిలిపించుకోవడంతో పాటు- ఇక్కడున్న పాక్ రక్షణ శాఖ సలహాదారులను కూడా దేశం వీడాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప్రధాని మాట్లాడుతూ ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయింది. ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి. ఇది కేవలం పర్యాటకులకు జరిగిన దాడి మాత్రమే కాదు.. భారత ఆత్మపై దాడి చేసేందుకు శత్రువులు చేసిన సాహసం అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనక ఉన్నవారు.. కుట్రలో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, ట్రాక్ చేసి, శిక్షిస్తామని యావత్ భారతీయులకు హామీ ఇస్తున్నా. బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉంది. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసేందుకు సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని ప్రధాని గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతిఒక్కరూ మాకు అండగా నిలిచారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలు కొట్టలేరు. ఉగ్రవాదానికి శిక్ష తప్పదని మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా ఉగ్రవాదుల ఘాతుకాన్ని ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో యావత్ దేశం ఏకమైందని అన్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం

దల . ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు- గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు- దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివి÷-లలైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు- మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.' అని కేటీ-ఆర్ నేటి దుస్థితిని వివరించారు.
చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

## గ్రామాలు స్వయం ప్రతిపత్తి సాధించాలి

గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, మౌలిక వసతుల కల్పన వంటి పురోగతిని పవన్‌కు అధికారులు వివరించారు. అంతకుముందు కార్యక్రమంలో పహెల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అందరూ మౌనం పాటించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు- అయిన సందర్భంగా తాను పంచాయతీ రాజ్ శాఖను ఇష్టంగా ఎంచుకున్నానని చెప్పారు. నేడు గ్రామాల్లో రోడ్లు, నీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో కీలక పాత్ర వారిదేనన్నారు. ఈ అభివృద్ధి పనులకోసం నగలు తాకట్టు- పెట్టి పనులు చేశారని, నిధులు రావడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. దీని వల్ల కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వలేక పోయామన్నారు. త్వరలో నిధులు వస్తాయని... అందరికీ బిల్లులు చెల్లిస్తామని పవన్ కల్యాణ్ భరోసా ఇస్తున్నామన్నారు. పంచాయతీల వ్యవస్థ బలోపేతం చేయడం కోసం తొలుత అధ్యయనం చేశానని, సిఫార్సులు, డబ్బులు లేకుండా బదిలీ ఉండదనే అభిప్రాయం ఉందన్నారు. ఎవరూ పైరవీలు చేయవద్దని తన పేషీ నుంచి ఆదేశాలు స్పష్టంగా ఇచ్చానని చెప్పారు. ఈసారి అన్ని స్థాయిల్లో అవినీతి లేకుండా బదిలీలు జరిగాయన్నారు. తాను సమర్థవంతంగా పని చేసే అధికారులను వెతికి పట్టు-కున్నానని, గతంలో నిర్లక్ష్యానికి గురి కాబడిన వారిని గుర్తించి ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చానని చెప్పారు. తనకు అనేక రూపాల్లో సిఫార్సులు వచ్చినా తాను నిబంధనల ప్రకారం వెళతానని చెప్పి అమలు చేశానన్నారు. కొన్ని గ్రామాలు వర్గ పోరు, కులాలపోరు వల్ల నష్టపోయాయని, కూటమికి చెందిన సర్పంచ్‌లు లేకపోయినా.. మేము ప్రజలకోసం ఆలోచన చేశామన్నారు. పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, ఎంపిపిలకు ఇచ్చే మర్యాద, గౌరవం ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, వారి నిధులు కూడా మళ్లించిందని, రూ. 1120 కోట్లు మన ప్రభుత్వం వచ్చాక పంచాయతీల అభివృద్ధికి వినియోగించామని పవన్ చెప్పారు. 100 నుంచి పది వేలు, 250 నుంచి 25 వేలు పంచాయతీల కు పెంచామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీ అనే పదం వాడకూడదన్నారు. గ్రామాల అభివృద్ధికి వాడే శ్రామికులు అంటే బాగుంటు-ందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కూడా దీనిపై ఆలోచన చేయాలని, నరేగా శ్రామికులు గానే ఇక నుంచి అందరూ పిలవాలని, ఉపాధి శ్రామికులకు వంద రోజుల పనికల్పించామన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశామని, రూ. 10,690 కోట్లు- తొమ్మిది నెలల పాలనలో ఖర్చు చేసి గ్రామాలు అభివృద్ధి చేశామన్నారు. రూ. 1005 కోట్లతో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి చేశామన్నారు. ఏపీ అభివృద్ధిలో పంచాయతీ రాజ్ శాఖ పని తీరు చాలా కీలకమని, ఉద్యోగులు, సిబ్బందికి మేము ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. గ్రామీణాభివృద్ధిలో మోదీ, చంద్రబాబు నాయకత్వంలో మన ఏపి 24వ స్థానం నుంచి రెండో స్థానంలోకి వచ్చిందన్నారు. చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయ నేందుకు ఇదే నిదర్శనమన్నారు. గ్రామాల్లో కలప మొక్కలు పెంచాలని నిర్ణయించామని, ఎపిలో నాలుగో వంతు ఉన్న దేశాల్లో కలప ప్రధాన ఆదాయ వనరుగా ఉందన్నారు. ఏపిలో కూడా కలప పెంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. గ్రామాల్లో ఉష్ణోగ్రతలు తగ్గించడంతో పాటు-, ఆదాయం కూడా వస్తుందని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అందరూ ఈ దిశగా ఆలోచన చేయాలని సూచించారు. స్వర్ణంధ్ర, ఆత్మ నిర్భర్ భారత్ సాధించేలా అందరూ కలిసి నడవాలని పిలుపిచ్చారు. చాలా ప్రాంతాల్లో పాఠశాలలకు ఆట స్థలాలు లేవని, రైల్వే కోడూరులో ఒక గ్రామంలో ఆట స్థలం కొని ఇవ్వాల్సి వచ్చిందన్నారు. చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, గ్రామాల్లో అసలు ఎంత భూమి ఉంది... ఎవరెవరు స్వాధీనం చేసుకున్నారో తేల్చాలని అధికారులకు సూచించారు. ఎటు-వంటి రాజకీయ పక్షాల అడ్డంకులు ఉన్నా తనకు చెప్పాలన్నారు. అన్ని గ్రామాల్లో స్థలాల వివరాలు తనకు అందించాలి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలలో భాష్యం ప్రభంజనం

( ఎడ్యుకేషన్) పదవ తరగతి ఫలితాలలో డాక్టర్స్ కాలనీ లోని భాష్యం పాఠశాల విద్యార్థులు జోషిక ఎండ్రీనా591, అక్సా అనాలిక 590 మార్కులతో ప్రభంజనం సృష్టించారు. 60 మంది విద్యార్థులు 500 మార్కు లకు పైగా మరియు36 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా ఫలితాలు సాధించారని, మరియు 506 యావరేజ్ మార్కులను సాధించారని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ గారు తెలియజేశారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ రాంప్రసాద్ గారు ఘనంగా సన్మానించారు. ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు సీఈఓ అనిల్ కుమార్ గారు, ప్రిన్సిపాల్ రాంప్రసాద్ గారు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి లత గారు, హెచ్‌ఎం ప్రియాంక గారు, ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## భారత్‌తో మేమూ కటీఫ్

వాఘాబార్డర్ మూసి వేస్తున్నట్టు తెలిపారు. వాణిజ్యపరమైన ఎగుమతులు, దిగుమతులు ఈ రెండు దేశాల మధ్య ఇకపై ఉండబోవని స్పష్టం చేసింది. పాకిస్తాన్ లో ఉంటు-న్న భారతీయులు 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని సూచించింది.యాత్రికులు, టూరిస్ట్ వీసాలపై వచ్చిన వారు వెంటనే వెళ్లి పోవాలని తెలిపింది. సింధూ నదిలో నీటి వాటాపై తాము ఐక్యరాజ్య సమితిలో సవాలు చేస్తామని స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రభుత్వ పక్షాన ఐదుగురు సభ్యులతో కమిటీ- వేయనున్నట్టు- తెలిపింది. అంతర్జాతీయ కోర్టులో ఎదుర్కోవాలని నిర్ణయించింది. బీఎల్ఏ ఉగ్రవాద సంస్థ కీలక నాయకులు భారత్ లోనే ఉన్నారని, కానీ ఎక్కడ ఉగ్రదాడి జరిగినా పాకిస్తాన్ ను నిందించడం ఫ్యాషన్ అయిపోయిందని ఫైర్ అయ్యింది. బీఎల్ఏ ఉగ్రవాదులు తమ వారిపై దాడి చేశారని తెలిపింది. ఉగ్రవాదులు భారత్ భూభాగంలో ఉండటం వల్ల తాము ఏమీ చేయలేకపోతున్నామని కమిటీ- తెలిపింది.

## నగరపాలక మేనేజర్‌కు అదనపు బాధ్యతలు

( కర్నూలు) గరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడికి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు అదనపు బాధ్యతలు కేటాయించారు. ప్రజా సంబంధాల అధికారి కే.ఎల్.యన్. రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం పొదిలి కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో, ఆయన నిర్వర్తించిన బాధ్యతలను కమిషనర్ మేనేజర్ చిన్నరాముడికే అప్పగిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు.



## నేడు ఢిల్లీకి వెళ్లనున్న సిఎం చంద్రబాబు

అమరావతి,ఏప్రిల్24(
: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోమారు శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం చంద్రబాబు కలవనున్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రధానితో చంద్రబాబు భేటీ అవనున్నారు. మే 2వ తేదీన ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్న సమయంలో చంద్రబాబు భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో ఏపీ పర్యటనకు సంబంధించిన విషయాల గురించి సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను మే2న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏపీకి మోదీని సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అమరావతి, ఏపీకి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. రాత్రికి ఢిల్లీలోనే సీఎం చంద్రబాబు బస చేస్తారు. శనివారం ఉదయం సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి బయలుదేరి విశాఖపట్నానికి చేరుకుంటారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు.

## ములుగు కర్గగుట్టల్లో ఎన్‌కౌంటర్

### -ఐదుగురు మావోయిస్టుల మృతి

ములుగు,ఏప్రిల్24
ములుగు జిల్లాలోని తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భీమారంపాడు సమీపంలోని అటవీప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన భీకర పోరు ఐదుగురు మావోయిస్టులు మరణించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మాతో పాటు దాదాపు 2500 మంది మావోయిస్టులు భీమారంపాడు సమీపంలోని కర్రగుట్టలో ఉన్నట్లు నిఘావర్గాలకు ఇటీవల సమాచారం అందింది. దీంతో కర్రగుట్ట అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు రెండు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టింది. అటవీ ప్రాంతం మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేయడంతో పాటు హెలికాప్టర్లతోనూ మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే తారసపడ్డ మావోయిస్టులపై కాల్పులు జరిపి ఐదుగుర్ని హతమార్చారు. ఈ కూంబింగ్ ఆపరేషన్ నేపథ్యంలో భీమారంపాడు గ్రామస్తులు ఎవరూ కూడా బయటకు రావద్దని భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేశాయి. కాగా, ఈ ఆపరేషన్ గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ మైకమిషన్‌లో సంబరాలు

### -కేక్ కట్ చేసుకున్న వీడియోపై దేశవ్యాప్తంగా నిరసనలు

న్యూఢిల్లీ,ఏప్రిల్24
ఏప్రిల్ 22వ తేదీన పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి ప్రతీ భారతీయుడి మనస్సును కలచివేసింది. ఈ దాడిని ఖండిస్తూ.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దాడికి దేశమంత కన్నీటిపర్యంతమవుతుంటే.. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ అధికారులు సంబురాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకు ఆధారాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆ కార్యాలయంలోకి ఓ వ్యక్తి కేకు తీసుకువెళ్లాడు. మీడియా ప్రతినిధులు ఆ కేకు ఎందుకని ప్రశ్నించగా.. అతను సమాధానం చెప్పకుండా తప్పించుకొని లోపలికి వెళ్లాడు. దీంతో పాక్ అధికారులు ఉగ్రదాడిని సెలబ్రేట్ చేసుకున్నట్లే తెలుస్తోంది. దీనిపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ హై కమిషన్ ఎదుట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు.

## ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత..

### -జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,ఏప్రిల్24
: ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వై రామయ్య( టీడీపీ), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి ఉన్నారు.

## సంపద సృష్టి పేరుతో బోల్తా

### -పతకాలు లేకున్నా..అప్పల వృష్టి-మాజీ ఆర్థికమంత్రి బుగ్గన ఎద్దేవా

అమరావతి,ఏప్రిల్24
సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ.. అంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సెటైర్లు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి.. అప్పు.. సంపద పరిస్థితి ఏంటి..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేంద్రంలో మద్దతు ఉందని చెప్పుకుంటున్నారు. కానీ, ఎటువంటి మార్పు లేదని ఆయన దుయ్యబట్టారు. అప్పు అంత ఉంది.. ఇంత ఉందని ఎవరు నోటికి ఏదొస్తే అది చెప్తున్నారు.. మట్కా లెక్కల మాదిరి అప్పు లెక్కలు మాట్లాడుతున్నారని ప్రజలు అంటున్నారన్నారని బుగ్గన అన్నారు. సంపదను సృష్టిస్తామని చెబుతుంటే అనుభవం గల నేతలని ప్రజలు వారిని నమ్మారని ఆయన పేర్కొన్నారు. ఇక, వైసీపీ దిగిపోయే నాటికి 81400 కోట్ల పన్ను ఆదాయం ఉంటే.. మా కంటే తక్కువగా మీ ఆదాయం ఉంది అని బుగ్గన అన్నారు. మా కంటే 7.5 శాతం తక్కువగా కూటమి ప్రభుత్వం సంపద సృష్టి ఉంది.. సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ చేసింది కూటమి ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు.. సామాన్య మానవుడి కోసం మేం పరిపాలన చేశాం.. వైసీపీ అప్పు చేసింది అంటారు.. మా కంటే అప్పు ఎక్కువగా చేసి ఎవరికి పెడుతున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న ఉన్నపుడు ఉన్న పథకాలు రావడం లేదని విమర్శించారు. మీరు అధికారంలో ఉన్నా పథకాలు రాలే..? కానీ, సంపద అంతా ఎక్కడికి పోతుంది అంటూ కూటమి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఉగ్రదాడిపై సోకాల్డ్ సెక్యులరిస్టులు మాట్లాడరేం

సిద్దిపేట,ఏప్రిల్24(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఖండించారు. ఈ సందర్భంగా అమరులకు సంతాపం తెలిపారు. పహల్‌గామ్‌లో తీవ్ర వాదుల చర్య దుర్మార్గమైనదని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... అన్యపుణ్యం తెలవని 27మంది పర్యాటకులను ఉద్రవాదులు దుర్మార్గంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడల్లా దేశంలో అలజడులు జరుగుతున్నాయని ఆరోపించారు. జమ్మూ కశ్మీర్‌లో తెలంగాణకి చెందిన 150మంది పర్యాటకులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనపై సోకాల్డ్ సెక్యులర్ మేధావులు ఎందుకు నోరు మెదపడం లేదని.. వారికి దేశం పట్ల ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. తమిళనాడు సిఎం స్టాలిన్, కమలహాసన్, ప్రకాశ్‌రాజ్ ఎందుకు జమ్మూ కశ్మీర్ ఘటనపై నోరు మెదపడం లేదని.. ఈ దేశంపై మీకు ప్రేమ లేదా అని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. టెర్రరిస్ట్ సంస్థలపై మోదీ ప్రభుత్వం ఖచ్చితంగా చర్యలు తీసుకుంటు-ందని అన్నారు. రాబర్ట్ వాద్రా బీజేపీపై బురదజల్లటం మానుకోవాలని.. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఒవైసీ పేద ముస్లింల కోసం ఆలోచించడం లేదని చెప్పారు. డెవలప్‌మెంట్‌కి ముస్లింలను దూరంగా ఉంచేది ఏంఐఎం పార్టీ అని విమర్శించారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో జరుగుతున్న సంఘటనలు బాధాకరమని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఒక వర్గానికి చెందిన కొంతమంది శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మదర్సాల గురించి రేవంత్ ప్రభుత్వం ఆలోచించాలని చెప్పారు. తెలంగాణను ఇస్లామిక్ అడ్డాగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హిందూ ధర్మం పరమత సహనాన్ని పాటించమని చెబుతోందని అన్నారు. హిందూ దేవాలయాల మీద దాడులు చేస్తే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో ప్రస్తుతం లేరని అన్నారు. మతం పేరిట జరిగిన దాడులను హిందువులు ఖండించాలని.. ఆలోచించాలని చెప్పారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మదర్సాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అల్లకల్లోలంగా మారిందని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**చింతపట్ల, నంది వనపర్తి, మంతన్ గౌరెల్లి గ్రామాల్లో ప్రారంభం**



యాచారం సూర్య న్యూస్ ( ఏప్రిల్ 24):. ప్రభుత్వం రైతుల సౌకర్యం ఏర్పాటు కోసం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్ అన్నారు. గురువారం అనంతరం.. నంది వనపర్తి, మంతన్ గౌరెల్లి, చింతపట్ల గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ , డైరెక్టర్లు మస్కు నరసింహ, గులాం అక్బర్ ప్రారంభించారు. రైతుల సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపి కాస నరసింహ, డీసీఎంఎస్ నరసింహ, ఏ ఈ ఓ, సంతోష్, రమేష్, సెక్రటరీ రవికుమార్ రెడ్డి. గ్రామ సంఘం అధ్యక్షురాలు దేంది యాదమ్మ, మస్క పుష్ప, కాంగ్రెస్ నేతలు రాచర్ల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మంకాల దాస్, అరవింద నాయక్, బిలకంటి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లిక్కి సరిత పాండురంగారెడ్డి, అమృత సాగర్, మహమ్మద్ ఇబ్రహీం, ఇటుకల లక్ష్మారెడ్డి, లిక్కి సుధాకర్ రెడ్డి, పెండ్యాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం-గిరిధర్ రెడ్డి

-అహింస, శాంతి సిద్ధాంతాలను స్మరించుకుందాం -రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్న బిజెపిని తిప్పికొడదాం

-మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించాలి -ఎన్నికల్లో వచ్చినప్పుడే కాశ్మీర్ పై ఉగ్రవాదుల దాడుల

-మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ఆరోపణ-మనువాదాన్ని వ్యతిరేకించాలి







యాచారం సూర్య న్యూస్( ఏప్రిల్ 24):. తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ అనే నిదానాలతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడాలని యాచారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్క్ నరసింహ ఆధ్వర్యంలో నంది వనపర్తి, చింతపట్ల, మంతన్ గౌరెల్లి, గ్రామాలలో కాంగ్రెస్ ఇన్చార్జిగా గిరిధర్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గురువారం ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పీఠికను ప్రజల సమక్షంలో సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యం, లౌకిక రాజ్యం, సామ్యవాదం అనే అంశాలతోని పరిపాలన సాగుతుందని నేతలు తెలియజేశారు. దోపిడి పీడనకు గురికాకుండా భారతీయులు న్యాయాన్ని పొందే అవకాశం రాజ్యాంగం కల్పించిందని నేతలు తెలిపారు. హిందువుల పేరుతోనే దేశంలోని పరిపాలన కొనసాగించడం వారు తప్పు పట్టారు. భారతదేశంలో మత స్వాతంత్రపు హక్కు ప్రతి మతానికి, ప్రతి పౌరునికి స్వేచ్ఛ ఉంటుందని తెలియజేశారు. హిందువులకు, వివిధ మతాలకు భేద అభిప్రాయాలకు గురిచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని కోరారు. దేశ ప్రజలకు, సమన్యాయం, సమాన హక్కులు కల్పించాల్సిన పాలకులే రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న బిజెపి పాలకుల తీరు ను ఖండించాలని పిలుపునిచ్చారు. మత స్వేచ్ఛను కాలరాస్తూ, కట్టు,బొట్టు తిండి, పూజ లపై ఆంక్షలు విధిస్తూ ప్రజల హక్కులను భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని బిజెపి అగ్రనేత నేతలు మారుస్తామని, ఎన్నో సవరణలు తెచ్చి ఈ దేశాన్ని ఉగ్రవాదంతో ఎంతోమందిని భారతీయులను బలి చేసిన మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ పోరాటంలో సిపాయిల తిరుగుబాటు, మహాత్మా గాంధీ నాయకత్వం, భగత్ సింగ్, త్యాగాల నుండి అంబేద్కర్ లక్ష్యాలనుండి సావిత్రిబాయి పూలే, వరకు భారతదేశంలో ప్రయాణం చేసిందని గుర్తు చేశారు. భారతీయుల అసమానతలు తొలగి ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, శాంతి సంక్షేమ రాజ్యాంగాన్ని రక్షించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో ఈ మూడు గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, మంకాల దాస్, బిల్లా కంటి శేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అరవింద్ నాయక్, మూడేడ్ల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ లిక్కి సరిత పాండురంగారెడ్డి, అమృత సాగర్, కేసరి సాగర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు పెండ్యాల యాదగిరి, నర్రె శ్రీశైలం, కడారి యాదయ్య, మహమ్మద్ ఇబ్రహీం, ఇటికాల లక్ష్మారెడ్డి, లిక్కి సుధాకర్ రెడ్డి, దొడ్ల అంజయ్య, మచ్చ జంగయ్య, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ జాంగిర్, మన్యం అజయ్ కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ పంచాయతీరాజ్ దినోత్సవం



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 24): గ్రామపంచాయతీలో మంచినీటి సరఫరా శానిటేషన్ రెగ్యులర్ గా కొనసాగించవలసినదిగామండల ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి అన్నారు.నేషనల్ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేశంపేట మండలం పరిధిలోనిగ్రామపంచాయతీలలో గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం జరిగినది అందులో భాగంగా వాటర్ శానిటేషన్ అండ్ హైజానిక్ దానిమీద చర్చించడం జరిగింది. మరియు గ్రామపంచాయతీలో మంచినీటి సరఫరా శానిటేషన్ రెగ్యులర్ గా కొనసాగించవలసినదిగా ఆదేశించారు. స్వచ్ఛ సుజల్ గావ్ ప్రతిజ్ఞను పాల్గొన్న వారిచే చేయించారు. ఎంపీడీఓ కోనాయిపల్లి కేశంపేట సుందరాపూర్ మరియు కాకునూరు గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామ సభలో పాల్గొన్నారు

# షాద్ నగర్ లో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా

# 26వ మహాసభలు

**మహాసభల సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక**

షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 24): తెలంగాణ రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు విద్యావ్యవస్థను గాలికి వదిలేశాయని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ ఆరోపించారు.భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రంగారెడ్డి జిల్లా 26వ మహాసభలు షాద్ నగర్ లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ హాజరై మాట్లాడుతూ... ఎస్ఎఫ్ఐ 1970 లో కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో డిసెంబర్ 30 , 31 తేదీల్లో స్వాతంత్రం ప్రజాస్వామ్యం అనే లక్ష్యం పెట్టుకొని అధ్యయనం పోరాటం చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు... అనే నినాదాలు తీసుకొని ముందుకు సాగుతుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక విద్యార్థి సమస్యల పైన అలుపెరుగని పోరాటం చేస్తుందని అన్నారు . విద్యార్థులకు స్కాలర్ షిప్ ఫీజు రీఎంబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు ప్రభుత్వాలు గురిచేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తుంది అని అన్నారు.కార్పొరేట్ నారాయణ శ్రీ చైతన్య విద్యాసంస్థలు తల్లిదండ్రుల దగ్గర కోట్ల రూపాయలు ఫీజుల రూపంలో దండకున్నటువంటి పరిస్థితి ఉంది కానీ ప్రభుత్వం ఈ కార్పొరేట్ విద్యా సంస్థల పైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే ప్రభుత్వ విద్యా సంస్థలు నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్ కేంద్రంలో నేటికీ ప్రభుత్వ కళాశాల అసంపూర్తిగా ఉండే చెట్ల కింద ఆరుబయట చదువుకున్నటువంటి పరిస్థితి ఉంధని, ఏదైతే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి నిధులు కేటాయించకుండా విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం రాష్ట్ర ప్రభుత్వం చేస్తా ఉంది విద్యారంగం అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర బడ్జెట్లో 30% నిధుల కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్తే కానీ ప్రభుత్వాలు విద్యారంగానికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి ఉంది. అని తెలిపారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది కాబట్టి ఈ ఒక నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందన్నారు. ఈ సందర్భంగా 21 మందితోని నూతన జిల్లా కమిటీ 9 మందితో కార్య వర్గం ఎన్నుకొన్నారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కేవై ప్రణయ్, బి శంకర్ ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మస్కు చరణ్ , వడ్ల శ్రీకాంత్ , గుండె శివ, ఏర్పుల తరంగ్, సహాయ కార్యదర్శిగా అరుణ్, మద్దెల శ్రీకాంత్ , మీసాల స్టాలిన్ జిల్లా కమిటీ సభ్యులుగా బి. వంశీ , శ్రీనివాస్, విప్లవ కుమార్, తనీష్, ప్రణవ్, శివ, తరుణ్, రాము, చరణ్ తదితరులు ఎంపికయ్యారని తెలిపారు.





# ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న సెక్రటరీ రాజు

**-హర్ష వ్యక్తం చేసిన మండల అధికారులు -రాష్టంలోనే నెంబర్ వన్.. మాల్**




యాచారం సూర్య న్యూస్ ( ఏప్రిల్ 24):. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మాల్ గ్రామపంచాయతీ జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు ఆత్మ నిర్భార్ విభాగంలో ఎంపికైనట్లు ఈ నెల 20న తెలిసిందే. గురువారం భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా మధుబాని, బీహార్ లో యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి, మాల్ గ్రామపంచాయతీ సెక్రటరీ రాజు, ఉత్తమ అవార్డు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాల్ గ్రామపంచాయతీ నెంబర్ వన్ గా నిలిచింది. జిల్లా అధికారులు, మండలాధికారులు గ్రామ సెక్రెటరీ రాజును అభినందించారు. మాల్ గ్రామంలో ప్రజలు,, గ్రామపంచాయతీ సిబ్బంది, రాజకీయ నాయకులు సంబురాలు నిర్వహించుకున్నారు. జాతీయస్థాయిలో మాల్ పంచాయితీకి అవార్డు రావడం వేలాదిమంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీలత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# హత్య కేసును చేదించిన షాద్ నగర్ పోలీసులు

## - అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్ సిహెచ్ రంగస్వామి వెల్లడించారు

## - ఇద్దరు అరెస్ట్ రిమాండ్- ఆటో, వేట కొడవలి సీజ్




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 24): సమాజం ఎటు పోతుంది మానవత్వం మంట కలుపుతున్నారు. అనటానికి ఇదో నిదర్శనం సొంత భర్తనే ప్రియుడితో కలిసి అక్రమ సంబంధానికి ఇబ్బందిగా ఉన్నాడని దారుణంగా హత్య చేసిన సంఘటన సంచలనం రేకెత్తించింది. భర్తను హతమార్చి చివరకు తానే పోలీసులకు కనిపించడం లేదని ఫిర్యాదు చేసి పోలీసులకు ఊహించని కథ మార్చింది . రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) ఎన్ సిహెచ్ రంగస్వామి పత్రిక సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి,భర్తను హత్య చేసి పోలీసులకు ఫిర్యాదు చేసిన,ఫరూక్ నగర్ మండలం చిన్న చిల్కమర్రి గ్రామానికి చెందిన ముద్దునోళ్ల ఎరుకలి మౌనిక తన భర్త ఎరుకలి యాదయ్య (32) గత ఫిబ్రవరి 19వ తేదీన కనిపించకుండా పోయాడని షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో మౌనిక ఫిర్యాదు చేసింది. పట్టణ సీఐ విజయ్ కుమార్ ఎఫ్ఐఆర్ నెంబర్ 205/ 2025 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, స్థానిక ఏసిపి సిహెచ్ రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ విజయ్ కుమార్ ఎస్సై సుశీల, హెడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్, సిబ్బంది సువర్ణ నరేందర్ రాజేష్ కరుణాకర్ ల బృందం ఈ కేసులో విచారణ మొదలుపెట్టినట్లు ఎసిపి రంగస్వామి తెలిపారు. అయితే ఈ కేసులో ఎరుకలి మౌనికకు ఫరూక్ నగర్ మండలం కందివనం గ్రామానికి చెందిన ఎరుకలి అశోక్ (ఆటో డ్రైవర్) తో అక్రమ సంబంధం సాగుతోంది. 8 సంవత్సరాల క్రితం ఎరుకలి మౌనికతో యాదయ్యకు వివాహం జరిగింది. మృతుడికి ఇద్దరు పిల్లలు. మృతుడు కూలి పని చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మందు తాగుతూ ఇంటి అవసరాలకు డబ్బులు ఇవ్వకుండా సంసారం విషయంలో ఎరుకలి మౌనికకు తరచు గొడవ జరిగేది. చిలకమర్రి గ్రామం పక్కన గల రాఘవేందర్ పత్తి కంపెనీలో పనికి వెళ్తున్న మౌనికకు అదే కంపెనీలో ఆటో డ్రైవర్ గా పని చేసే ఎరుకలి అశోక్ తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారితీసిందని ఏసిపి తెలిపారు. మౌనిక భర్త యాదయ్య తరచూ కొడుతున్నాడన్న సమాచారంతో అశోక్, మౌనికలు కలిసి తమ అక్రమ సంబంధానికి అడ్డు లేకుండా చేయాలని ఉద్దేశంతో ఫిబ్రవరి 18వ తేదీన సాయంత్రం ఏడు గంటల సమయంలో అశోక్ మృతుడు యాదయ్యను తన బాబాయి యొక్క ఊరు రామంజపూర్ లో విందు ఉందని వెంట తీసుకువెళ్లాడు. యాదయ్య మౌనికలను ఆటోలో తీసుకెళ్లిన అశోక్ రాత్రి 11 గంటల సమయంలో గూడూరు గ్రామం పెద్దగట్టు తాండ దాటిన తర్వాత రోడ్డు పక్కన ఆటో నిలిపి నిర్మానుష ప్రదేశానికి తీసుకువెళ్లి బాగా మద్యం తాగించారు. బాగా మద్యం తాగిన యాదయ్య నిద్రలోకి జారుకోగానే ఒక వేట కొడవలితో మృతుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. అంతేకాకుండా తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను అతనిపై పోసి శవాన్ని కాల్చినట్లు ఎసిపి రంగస్వామి తెలిపారు. నేరం జరిగాక ఇరుకలి మౌనిక అశోక్ లు షాద్ నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారనీ ఎసిపి పేర్కొన్నారు. వీరిపై అనుమానం వచ్చిన పోలీసులు దర్యాప్తులో భాగంగా ఏప్రిల్ 23వ తేదీన ఇరువురిని షాద్ నగర్ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారించారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తడబడి ఉన్న వాస్తవ విషయాలను ఒప్పుకున్నారు అని ఏసిపి తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కడ హత్య చేసి శవాన్ని పాతిపెట్టారు అక్కడికి నేరస్తులను తీసుకువెళ్లి వాస్తవాలు తెలుసుకున్నట్లు ఏసీపి తెలిపారు.

అప్పటికే శవం పూర్తిగా ఎముకల గూడుగా మిగిలిందని సదరు ఎముకలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఒక ఆటో, వేట కొడవలి హత్యకు ఉపయోగించిన వస్తువులను సీజ్ చేసినట్లు ఏసీపి రంగస్వామి తెలిపారు. అక్రమ సంబంధం నేపథ్యంలోనే ఎరుకలి యాదయ్యను దారుణంగా హతమార్చి చంపారని, నిందితులు నేరం ఒప్పుకోవడంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఏ సి పి రంగస్వామి తెలిపారు. ఈ కేసులో చాకచకంగా పనిచేసిన సీఐ విజయ్ కుమార్, ఎస్సై సుశీల, హెడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్ సిబ్బంది సువర్ణ నరేందర్ రాజేష్ కరుణాకర్ లకు తగిన రివార్డులను ఇప్పించేందుకు పై అధికారులకు నివేదిక పంపిస్తామని పత్రిక సమావేశంలో తెలిపారు.

# రైతులు, దళారులను నమ్మి మోసపోవద్దు

## -: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 24): రైతన్నలు దళారులను మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారంకొందుర్గ్ మండల కేంద్రంలో కొందుర్గ్ ప్రాథమిక సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కోనుగోలు కేంద్రం ని ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ,ఈ కార్యక్రమంలో కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి ,మార్కెట్ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,కొందుర్గ్ ప్రాధమిక సహకార సంఘము చైర్మన్ దామోదర్ రెడ్డి,రామయ్య గౌడ్, పురుషోత్తం రెడ్డి,ఇబ్రహీం,యాదయ్య, చంద్ర శేఖర్, మహబూబ్ రాజు, మల్లేశ్ గౌడ్, ఆంజనేయులుతదితరులు పాల్గొన్నారు.

# ఉచిత అంబలి కేంద్రం చలివేంద్రంను ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.




షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 24) :
వేసవికాలంలో అంబలి త్రాగునీరు ఉచితంగా అందించడం ఎంతో మంచి పుణ్య కార్యక్రమం అని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. గురువారం షాద్ నగర్ పట్టణం లో పరిగి రోడ్డు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద కాంగ్రెస్ యువ నాయకుడు మంగ అశోక్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం, చలి వే%శీ%ద్రం ని ప్రారంభించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, అగ్గనూర్ బస్వ%శీ%, రఘు నాయక్,ఇబ్రహీం, రమాదేవి ,మధు,వాసు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా సిద్దం.ఉజ్వల్ రెడ్డి సొంత నిధులతో బోర్ ఏర్పాటు



జహీరాబాద్ సూర్య న్యూస్ ఏప్రిల్ 24: డైవర్స్ కాలనీలో నీటి సమస్యను స్థానిక ప్రజలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు.దీంతో గురువారం రోజున బోర్ డ్రిల్ చేసేందుకు డా??సిద్దం.ఉజ్వల్ రెడ్డి పూజా కార్యక్రమం నిర్వహించి కొబ్బరికాయ కొట్టి బోర్ తవ్వకాన్ని ప్రారంభించారు.ప్రజలు నీటితో కష్టాలు పడకుండా ఉండేందుకు బోర్ డ్రిల్ చేయిండం పట్ల స్థానిక ప్రజలు హర్షవ్యక్తం చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా??ఉజ్వల్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఎ సి సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ భీమయ్య,పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ళ.శ్రీకాంత్ రెడ్డి,యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి,అశ్విన్ పాటిల్, ప్రతాప్ రెడ్డి,రంగా అరుణ్ కుమార్,యూత్ కాంగ్రెస్ న్యాల్కల్ మండల అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్ గౌడ్,సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు జమిలాలోద్దిన్,మైనార్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు జావిద్,బి.మల్లికార్జన్,అక్బర్,హర్షద్ పటేల్,ముస్తఫా,నిజాం,బర్కత్ మరియు డైవర్స్ కాలనీ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ చట్టాలు రద్దు చేయాలి

: ఎమ్మిగనూరు

కార్మికుల హక్కులకు నష్టం కలిగించే 4 లేబర్ చట్టాలను రద్దు చేయాలని, మే 20న కార్మిక హక్కుల పరిరక్షణకు నిర్వహించు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు పేర్కొన్నారు.

గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి అంజిబాబు మండల అధ్యక్ష కార్యదర్శులు పి గోవిందు బి రాముడు మాట్లాడుతూ కార్మిక వర్గం బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న కనీస వేతన హక్కు చట్టం సమ్మె హక్కు చట్టం 8 గంటల పని విధానం సామాజిక భద్రత చట్టం తదితర చట్టాలు కార్మికులు సాధించుకున్నారని తెలిపారు ల సమయంలో 2019 2020 కాలంలో ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులకు పూర్తిస్థాయిలో నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ చట్టాలను అమలు చేయడానికి సన్నద్ధమవుతుందని అన్నారు ఈ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి 2025 ఏప్రిల్ నుండి అమలు చేయాలని సూచనలు చేస్తుందని అన్నారు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రధానంగా మున్సిపల్ రంగంలో కాంటాక్ట్ కార్మికులైన వీరికి 60 సంవత్సరాలు పూర్తయిన వారికి తొలగింపు చేయాలని అదేవిధంగా అప్కస్ ను రద్దు పరచి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పడాన్ని సిఐటి వ్యతిరేకిస్తుందని అన్నారు కార్మికులకు సర్వీసును అమానుషంగా తీసివేయడం చాలా అన్యాయం అన్నారు కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులకు గ్రాస్ డ్యూటీ పెన్షన్ వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు కార్మికులకు నష్టపరిచే నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేసే వరకు కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని




అదేవిధంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న లేబర్ చట్టాలను రద్దు చేయాలని దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కే ఇస్మాయిల్ బి కేసన్న కే గోరు భాష బి సల్మాన్ కే కాజా బి రంగస్వామి సిఐటియు నాయకులు పి రాజు తిమ్మప్ప పాల్గొన్నారు

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

ఉప ఎన్నికలు, అవిశ్వాస తీర్మానాల సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు తెగువ చూపారని.. వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో గురువారం ఆయన భేటీ అయ్యారు. ముందుగా జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి మృతికి సంతాపంగా వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాసేపు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభించారు. చంద్రగిరి ఎంపీపీ ఉప ఎన్నికల్లో గెలిచాక జై జగన్, జై వైఎస్సార్‌సీపీ అన్నారని కేసులు పెట్టారు. గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు తిరిగే ధైర్యం లేదు. తిరిగితే ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ విధ్వంసం. ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లడాన్ని నరకంగా మార్చేశారు. విద్యా, వైద్య రంగాలు దారుణంగా తయారయ్యాయి. చంద్రబాబుగారు అధికారంలో వచ్చాక 4 లక్షలు పెన్షన్లు తీసేశారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. బెల్టుషాపులు గుడి, బడి పక్కనే కనిపిస్తున్నాయి. ప్రతి బాటిల్‌పైన రూ.20ల ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. వైఎస్సార్‌సీపీలో కన్నా ఇసుక రేటు రెండింతలు పెరిగింది. ఉచితం అని చెప్పి.. దోచుకుంటున్నారు. పైనుంచి కిందిదాకా ముడుపులు చెల్లిస్తేనే మైనింగ్ అయినా, పరిశ్రమ అయినా నడిచేది. అవినీతినుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ టాపిక్స్ ఎంచుకుంటున్నారు. విశాఖపట్నంలో ఊరూపేరు లేని ఉర్సా లాంటి కంపెనీలకు రూ.3,000 కోట్లు- ఖరీదు చేసే భూములిస్తున్నారు. ఒక చిన్న ఇంట్లో రెషిడెన్షియల్ అపార్ట్‌మెంట్ కట్టే కరెంటు బిల్లు ఆ కంపెనీ కడుతుంది. అమెరికాలో వాళ్ల ఆఫీసు చూస్తే.. అది కూడా చిన్న ఇల్లే. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ చంద్రబాబు హయాంలో ఉర్సా లాంటి ఊరూ పేరు కంపెనీకి రూ.3,000 కోట్ల డబ్బులు దోచిపెడుతున్నారు. విశాఖఫట్నంలో లూలు గ్రూపులకు, లిల్లీ గ్రూపులకు రూ.1500- 2000 వేల కోట్లు- ఖరీదు చేసే భూములను.. టెండర్లు లేకుండా కట్టబెట్టారు. లెఫ్ట్, రైట్, సెంటర్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమరావతి నిర్మాణ పనుల్లోనూ దోపిడీ. 2018లో ఐదేళ్ల కిందట చంద్రబాబు హయాంలో టెండర్లు పిలిచినప్పుడు పనుల విలువ రూ. రూ.36,000 కోట్లు-. అప్పట్లో ఇప్పటికన్నా స్టీలు, సిమెంట్లు రేట్లు ఎక్కువ. అయినా కూడా ఆ రూ.36,000 కోట్ల విలువ ఈరోజు రూ.78,000 కోట్లకు

పెంచేశారు. టెండర్లు రింగ్ ఫార్మ్ చేసి వాళ్ల కాంట్రాక్టర్లకే ఇచ్చుకుంటున్నారు. మొబలైజేషన్ అడ్వాన్సులు కొత్తగా ఇవ్వడం మొదలుపెట్టాడు. 10 శాతం మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇవ్వడం, అందులో 8శాతం కమిషన్లుగా తీసుకోవడం.. ప్రభుత్వం చేసిన అప్పులన్నీ ఎక్కడకు పోతున్నాయో తెలియడంలేదు. గతంలో ఎందుకు జగన్ చేయగలిగాడు.. చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నాడని అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. జగన్ నేరుగా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసేవాడు. ఇప్పుడు చంద్రబాబు హయాంలో బటన్లు లేవు.. నేరుగా ఆయన జేబులోకే పోతున్నాయి. ఇదే విషయాన్ని ఎన్నికల సమయంలో మొత్తుకుని చెప్పాను. చంద్రబాబు నాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ఈ రోజు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. వీటికి సమాధానం చెప్పుకోలేక ప్రతిరోజూ డైవర్షనే. ఒక రోజు లడ్డూ, మరోరోజు బోటు-.. ఇంకోరోజు ఐపీఎస్ ఆధికార్ల అరెస్టులు అంటూ డైవర్షన్లు చేస్తున్నారని మండిపడ్డారు. కరెంటు బిల్లులు షాక్ కొట్టేలా పెంచారు.. వీటి గురించి అడిగితే.. ఆయన చేసిన లిక్కర్ స్కాంను మరలా ఇంకొకరు మీద రుద్ది అరెస్టు చేస్తాడు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేసి దాన్నుంచి టాపిక్ డైవర్షన్ చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పాలన జరుగుతుంది. ఎంతో మంచి చేసిన మనమే ప్రతిపక్షంలో కూర్చొన్నాం. ఇక ఏ మంచీ చేయకుండా, మోసం చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కరలేదన్నారు. ఇంత మోసం చేసిన మనిషిని ప్రజలు సింగిల్ డిజిట్ రాని పరిస్థితుల్లోకి పరిమితం చేస్తారు.ఆ రోజు వస్తుంది. కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుంది. ప్రతి కార్యకర్తకు.. మన ప్రభుత్వంలో మీ జగన్ 2.0లో తోడుగా ఉంటాడు అని హామీ ఇస్తున్నాను. ఈ రోజు కార్యకర్త ఎంతలా ఇబ్బంది పడుతున్నాడో చూస్తున్నానని వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో అవినీతి విరుచుకుపడిందని, ప్రజలపై భారం పెడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థల్ని దెబ్బతీశారని జగన్ విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో 4 లక్షల పింఛన్లు తీయించారని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా దిగజార్చారని జగన్ విమర్శించారు. జగన్ హయాంలో డైరెక్ట్ బెనిఫిట్ ద్వారా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు వెళ్లేవని గుర్తుచేశారు. వైసీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేసిన జగన్, 'జగన్ 2.0లో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడుని నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. ప్రజలు మోసాన్ని గుర్తించి ఆయనను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేస్తారని జగన్ హెచ్చరించారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణకు సత్వర చర్యలు చేపట్టండి

## -జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

న్యూస్ నంద్యాల
రహదారి ప్రమాదాల నివారణ కోసం సత్వర చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నంద్యాల ఎఎస్పీ మంద జవాలి అల్ఫోన్స్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు డిఎస్పీ రామాంజనేయులు, ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్, నంద్యాల మున్సిపల్ కమీషనర్ నిరంజన్ రెడ్డి, ఎన్హెచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణ కోసం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత జిల్లా రహదారి భద్రతా సమావేశంలోనే నంద్యాల జిల్లా నేషనల్ హైవే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించినప్పటికీ ఇంకా పూర్తి చేయలేదని... వాటిని త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల మున్సిపల్ కమీషనర్ ను జెసి ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఏర్పాటు చేయాల్సిన స్పీడ్ బ్రేకర్స్, మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ వెలుగుల ఏర్పాటు పనులు, నేషనల్ హైవే పరిధిలో అవసరమై గుర్తించిన ప్రదేశాల్లో బ్యార్కేడ్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఎన్హెచ్ 40 చాబోలు సమీపంలో ప్రమాదాల నివారణ కోసం బ్యార్కేడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే శాంతిరాం ఆసుపత్రి దగ్గర కూడా బ్యార్కేడ్స్ తో పాటు ఇల్యూమినేషన్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతునగరం రోడ్డు వైపు ఉన్న పాట్ హోల్స్ అన్నిటిని క్లియర్ చేసామని ఆర్ అండ్ బీ ఎస్ఈ జాయింట్ కలెక్టర్ కు వివరించారు. అహోబిలం బైపాస్ రోడ్డు నుండి నంద్యాలకు వచ్చే వాహదారులు ఆపోజిట్ దారిలో రావడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుందని వాటి నివారణ కోసం సి-కర్వ్ బ్లాక్స్ ఏర్పాటు చేయాలని, చిన్నకందుకూరు రోడ్డు దగ్గర కూడా సర్వీసు రోడ్డులో వెళ్లకుండా ఆపోజిట్ దారిలో వెళ్తున్నారని, అదే విధంగా చాగలమర్రి గ్రామం మద్దూరుమెట్ట దగ్గర కూడా వాహనదారులు సర్వీసు రోడ్డులో వెళ్లకుండా ఆపోజిట్ రావడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆళ్లగడ్డ డిఎస్పీ వివరించగా క్షేత్ర స్థాయి పరిశీలించి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎన్హెచ్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా కుల్లూరు రాస్తా దగ్గర ఒక్కవైపు మాత్రమే స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారని ఇంకొక వైపు కూడా స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, ఆల్ఫా కాలేజ్ దగ్గర ఆర్టీసీ బస్సులు సూచించిన ప్రదేశంలో నిలబడేలా చూడాలని ఆళ్లగడ్డ డిఎస్పీ జాయింట్ కలెక్టర్ ను కోరారు. జిల్లాలో మొత్తం 23 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని అందులో 11 పూర్తి కాగా, ఇంకా 12 పెండింగ్ ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డోన్ మండలం ఉంగరాలగుండ్ల దారిలో రైలింగ్ పెండింగ్ ఉందని అందువల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్హెచ్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.రహదారి ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చేలా ఐరాడ్ తో సమన్వయం చేసుకోవాలన్నారు. డోన్ ఎన్హెచ్ 40 ప్రాంతంలో ప్రమాదాల నివారణ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కోరారు. హిట్ అండ్ రన్ కేసుల వివరాలను ఎప్పటికపుడు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వందేమార్ట్ పార్కింగ్ స్థలంలో ఇతర వస్తువులు ఉంచడం వల్ల పార్కింగ్ కు ఇబ్బంది అవుతుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని, నూనెపల్లె జంక్షన్ నుండి అయ్యలూరు మిట్ట వరకు మెరుగైన విద్యుత్ సరఫరా లేవని వాటిని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నంద్యాల మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఆర్ అండ్ బీ రోడ్ల మీద మార్కింగ్స్ వేయాలని, కొన్ని ప్రాంతాల్లో డస్ట్ బిన్స్ రోడ్డు మీద పెడుతున్నారని వాటికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నగరంలోకి హెవీ లోడ్ వాహనలు ఏ సమయంలో రావాలి అనే బోర్డులు ఏర్పాటు చేయాలని, అదే విధంగా తర్ధూరు, నాగలూటి ప్రాంతంలో అప్రోచ్ రోడ్డుకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు వారు కోరారు.





## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల బాలికల హాస్టల్ విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం



నంద్యాల
ప్రతి ఒక్కరికి ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ పై అవగాహన కల్పించాలన్న గౌరవ జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ రాజకుమారి గనియ గారి ఆదేశాల మేరకు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలోని జూనియర్ కళాశాల లో చదివే వసతి గృహంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ పై అవగాహన కల్పించడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు జిల్లా బిసి సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారిని చింతామణి గారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏవో డాక్టర్ భరత్ కుమార్ గారు విచ్చేసి బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో విపత్కర పరిస్థితులలో చేయవలసిన ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమన్నీ రెడ్ క్రాస్ జిల్లా డిఎఫ్ఓ అబ్దుస్ సమీ పర్యవేక్షించారు.

# కాల్షియం కార్బైడ్ పండ్ల విక్రయాన్ని నిరోధించండి

### -సాంప్రదాయ విధానంలో మగ్గ పెట్టిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించండి.

### -జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

నంద్యాల
సీజనల్ పండ్లు పక్వానికి వచ్చేందుకు కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిరోధించాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పండ్ల దుకాణాల వ్యాపారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకట రాముడు, షాషావలి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, డిపిఓ జమ్మీవుల్లా, ఎడి మార్కెటింగ్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ సీజనల్ పండ్లు పక్వానికి వచ్చేందుకు కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిరోధించి వినియోగదారుల ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందించేందుకు పండ్ల దుకాణదారులు సహకరించాలని కోరారు. కాల్షియం కార్బైడ్ పండ్లు మాగబెట్టే ప్రక్రియను నిరోధించేందుకు వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. పురపాలక, గ్రామ పంచాయతీలలో ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు ఈ విధానాన్ని నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సహజ హార్మోన్ ఎథిలిన్ గ్యాస్ చేయడం ద్వారా మామిడి పండ్లను మాగబెట్టవచ్చన్నారు. ప్రజలకు హాని కలిగించే కాల్షియం కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. కాల్షియం కార్బైడ్ వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శీతల గిడ్డంగిలో ఎథిలిన్ ఉపయోగించి పండ్లు మాగబెట్టే పద్ధతులపై వ్యాపారులు, విని యోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది అధికంగా శాంపిల్స్ సేకరించాలని, కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ, మునిసిపల్ సిబ్బందికి ఈ అంశంపై అవగాహన కల్పించాలన్నారు.

## భారతదేశ దశా దిశ నిర్దేశకుడు అంబేద్కర్

### - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనకు హాజరైన వేలాదిమంది









: ఎమ్మిగనూరు
భారతదేశ దశా దిశ నిర్దేశకుడు అంబేద్కర్ అని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. గురువారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరానికి చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన రంగస్థల నటులచే రాత్రి ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ ఓపెన్ థియేటర్ నందు నాటిక ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది మంది దళిత,బహుజనులు, ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీలు వేలాదిగా తరలివచ్చారు. కె.వి.పి.ఎస్. జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) రాష్ట్ర కార్యదర్శి, టిడిపి నాయకులు డా. మల్లెల ఆల్ ఫ్రేడ్ రాజు, సిపిఎం నాయకులు రామాంజనేయులు, గోవిందు, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్ చైతన్య మాదిగ, బీసీ సంఘం నాయకులు డాక్టర్ గణేష్ తదితరులు హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడారు. రంగస్థలం నటులచే అంబేద్కర్ జీవిత చరిత్రను నాటక కళా రూపంలో ప్రదర్శించడం కృషికి అభినందనీయమని ప్రశంసలు కురిపించారు. ఈ నాటక ప్రదర్శనలో ఆయన పుట్టుక, పేదరికం, పాఠశాలలో అణిచివేత, పై చదువులు, బాల్య వివాహము, అంశాలపై క్షుణ్ణంగా కళాకారులు ప్రదర్శించారు. ఈనాటిక దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు కరుణాకర్, మండల నాయకులు తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు

# పటిష్ట ఓటర్ల జాబితాను రూపొందిస్తాం

## జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్

నంద్యాల
ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగించేందుకు నిర్వహణను మరింత పటిష్టం చేస్తామని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పటిష్టమైన ఎన్నికల జాబితా, నిర్వహణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, బీఎస్పీ తరపున కొట్టం శ్రీనివాసులు, సిపిఎం తరపున కే శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ తరపున రియాజ్ భాషా, వైఎస్ఆర్సిపి పార్టీ తరపున సాయిరాంరెడ్డి, జనసేన పార్టీ తరపున రవికుమార్, ఎలక్షన్ సూపరిండెంట్ జయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచించిన ఆదేశాల మేరకు పటిష్టమైన ఓటర్ల జాబితా రూపొందించి ఎన్నికల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకున్న తీసుకుంటున్నట్లు తెలిపారు. గత సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని నిబంధనల మేరకు ఎన్నికల సంఘానికి నివేదించామన్నారు. రాజకీయ పార్టీలు బూతు ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని జాయింట్ కలెక్టర్ పార్టీ ప్రతినిధులను సూచించారు. సిపిఎం పార్టీ తరపున నర్సింహులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులతో పాటు డెత్ ఓటర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్ల స్లిప్పులలో పేర్లతో పాటు ఫోటో కూడా ఉంటే సులువుగా ఓటర్లు గుర్తించవచ్చని ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని జెసిని కోరారు



## దక్షిణ మధ్య రైల్వే జీ.ఎం అరుణ్ కుమార్ జైన్‌తో చర్చించిన ఎం.పి నాగరాజు



కర్నూలు,
కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పరిశీలనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ను ఎం.పి బస్తిపాటి నగరాజు కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలోని రైల్వే శాఖకుసంబంధించిన పలు అంశాల పై జీ.ఎం తో చర్చించిన ఆయన సమస్యల పై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు అధిక ప్రాధాన్యత కలిపించాలని, అలాగే మహబూబ్ నగర్ నుంచి డోన్ వరకు నిర్మిస్తున్న డబ్లింగ్ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు కర్నూలు నుంచి వైజాగ్ కు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయలాని జీ.ఎం అరుణ్ కుమార్ జైన్ ను కోరామని అన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# ప్రజల భద్రత, రక్షణల ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్

**కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ గారు.**

**జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో...**

**ముమ్మరంగా వాహనాల తనిఖీలు**

( క్రైమ్ )
జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీ లు చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు. హెల్మెట్ / సీట్ బెల్టు ధరించాలని, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ లో వాహన చోదకులు ట్రిపుల్ రైడింగ్, వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు లేనివారిని, వాహన సంబంధిత రికార్డులు లేనివారిని, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులను, సెల్ ఫోన్ డ్రైవింగ్, మరియు ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి, రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు గురించి అవగాహన చేస్తున్నారు.రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు జాగ్రత్తల సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలకు దూరంగా ఉండాలని, పేకాట , సైబర్ మోసాలు, మహిళలపై నేరాలు, బాల్యవివాహాలు, %జజ% కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యత పై అవగాహన చేశారు.గంజాయి , మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాల గురించి ప్రజలకు వివరించారు .అదేవిధంగా ఎవరైనా పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు సూచించారు.







# ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

**టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్**

మెదక్ )

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యటకులను నిర్దాక్షణ్యంగా కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక టీఎన్జీవో భవన్లో అత్యవసర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి మంగళవారం రోజు కాశ్మీర్లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన మారణకాండను కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. భారతదేశంలో హిందూ ముస్లిం క్రిస్టియన్ సిక్ తదితర మతాలు ఉన్న వారి వారి ఆచారాలను గౌరవిస్తూనే కుల మత జాతి భాష ప్రాంతాలకతీతంగా భారత పౌరులు ఐకమత్యంగా, హవాజ్ ధో హామ్ ఏక్ హై అనే నినాదంతో భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తున్నారని వారి ఐక్యతను చదరగొట్టి మత చిచ్చు పెట్టాలన్నదే ఉగ్రవాదుల అభిమతమని వారిని భారత ప్రభుత్వం ఉపేక్షించేది లేదని వెల్లడించారు. తమ దేశంలోని కాశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన అమాయక పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇలాంటి




ఘటనలు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని ఉగ్రవాదాన్ని అంతముందించేందుకు ప్రతి ఒక్క భారత పౌరుడు నడుంబిగించాలన్నారు. తదనంతరం కొవ్వొత్తులు వెలిగించి పహల్గాన్ అమరులకు జోహార్ అంటూ నినాదాలు చేస్తూ అశ్రు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా సహా అధ్యక్షులు ఎండి ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు ఎండి పజులుద్దీన్, కోటి రఘునాథరావు, సంయుక్త కార్యదర్శి పంపరి శివాజీ, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు సతీష్, సలావుద్దీన్, అల్లాదుర్ యూనిట్ అధ్యక్షులు ధర్మచందర్, ఏడుపాయల వనదుర్గ యూనిట్ కార్యదర్శి ప్రశాంత్, నీటిపారుదల శాఖ ఫోరం కార్యదర్శి శ్రీ హర్ష, పంచాయతీ కార్యదర్శుల ఫోరం బాధ్యులు సంతోష్, లింగప్ప, భరత్, మెదక్ యూనిట్ బాధ్యులు సలీం, శ్రీధర్, రామకృష్ణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

(జహీరాబాద్:



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్నింటి.నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ ఆర్డీఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో వికలాంగులతో ప్రత్యేకంగా శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేసి జాబ్ కార్డ్స్ ఇచ్చి 150 రోజులు పని కల్పించాలని అన్నారు. .రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగులకు 5 శాతం ఎస్సి ఎస్టీ బీసీ, మైనారిటీ కార్పొరేషన్లలో కేటాయించాలని కోరుతున్నాము. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతున్నాము అన్నారు. మండలంలో వికలాంగులను కించపరుస్తూ మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లోవికలాంగుల హక్కుల జాతీయ వేదిక జహీరాబాద్ మండల అధ్యక్షుడు ఎం రాజ్ కుమార్ అల్గోల్ మచ్చేందర్ బిస్మిల్లా శోభమ్మ వాజిద్ తదితరులు పాల్గొన్నారు..

# భూభారతి అవగాహన సదస్సు లో కలెక్టర్ వల్లూరు క్రాంతి అదనపు కలెక్టర్ డి.మాదురి, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నాగలి గిద్ద)

నగల్ గిద్ద మండల కేంద్ర పరిధిలోని జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'భూ భారత' చట్టం (భూమి హక్కుల రికార్డు -2025) మండల స్థాయి అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ డి.మాదురి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పొరపాట్లకు తావు లేకుండా భూభారతి చట్టం తీసుకువచ్చాంపది సంవత్సరాలుగా గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల నష్టపోయిన లక్షలాదిమంది ప్రజలు మరియు రైతుల విజ్ఞప్తుల మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ధరణి పోటాను తొలగించి భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని అన్నారు మార్పులు చేర్పులకు గతంలో అవకాశం లేదని ప్రస్తుత చట్టంలో రెవెన్యూ అధికారులకు అన్ని అనుమతులు ఇవ్వడం వల్ల రైతులకు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఎంతోమంది అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రజల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి భూములకు సంబంధించిన శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో భూభారతి చట్టం తెచ్చామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. భూభారతి చట్టంలో తీసుకువచ్చిన మార్పులను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించి రైతులను చైతన్యం చేయాలని ఆయన కోరారు అధికారులు తప్పు చేస్తే సహించేది



లేదన్నారు. నగల్ గిద్ద మండలంలోని అనేక గ్రామాలలో గతంలో బిఆర్ఎస్ నాయకులు ఎంతోమంది అమాయకమైన ప్రజల నుండి వారిని బెదిరించి వారిపై కేసులు పెట్టి మరి భూములను రైతుల నుండి ప్రజల నుండి కబ్జాలకు పాల్పడ్డారు



అలాంటి భూములకు ఈ భూభారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అలాంటి సమస్యలు ఉన్న ఈ భూభారతి చట్టం ద్వారా సమస్య పరిష్కారానికి ఎంతో సులువుగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు

ఈ కార్యక్రమంలో వారితోపాటు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి మరియు నారాయణఖేడ్ ఆర్ డి.ఓ అశోక్ చక్రవర్తి,ఎం.ఆర్.ఓ శివరామ కృష్ణా, ఎంపిడిఓ కులకర్ణి మహేశ్వర్ రావు మరియు రెవెన్యూ అధికారులు మరియు వ్యవసాయ అధికారులు మండల ముఖ్య కాంగ్రెస్ నాయకులు మాణిక్ రావు పటేల్, సచిన్ పటేల్, మాజీ ఎంపీటీసీ శేరికర్ పండరి నాథ్, అబ్దుల్ రహీమ్,వై.పండరి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ

## - జి ఎం ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

(నారాయణ ఖేడ్




కల్హేర్ మండల్ కొత్తచెరువు తాండకు చెందిన సెట్టేనాయక్ దేవి బాయి లా నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందించి వారి కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్ ఈ కార్యక్రమం జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చేందర్ సూచన మేరకు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, గుబ్బిపు నర్సింలు, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, తుకారాం తదితరులు ఉన్నారు

# 27న చలో వరంగల్ సభను విజయవంతం చేద్దాం

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంటి కృష్ణ

ఉప్పల్):.



వరంగల్ ఎలుకతుర్తి లో ఈనెల 27వ తారీకు నాడు 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కుంటి కృష్ణ ప్రజలకు, ప్రజాస్వామ్య వాదులకు, కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళ, కవులు, కళాకారులు, మేధావులు, బుద్ధి జీవులు హాజరై భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దగాకోరు విధానాలను రైతు కార్మిక విధానాలను తెలంగాణ ప్రజలను సంక్షేమ పథకాల పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే అధిక సంక్షేమ కార్యక్రమాలు ఉంటాయని అబద్ధపు మాటలు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు తక్షణమే రాజీనామా చేయాలని లేని పక్షంలో ప్రజాక్షేత్రంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని గ్రామాలకు వస్తున్న కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీల మీద నిలదీయాలని కుంటి కృష్ణ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.




# ఉసిరికేపల్లిలో చలివేంద్రం ప్రారంభం

**జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చేందర్**

(నారాయణ ఖేడ్

మనూరు మండలంలోని ఉసిరికేపల్లి గ్రామంలో వేసవి తాపం నుండి ప్రజలను రక్షించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చేందర్ ప్రారంభించారు. గ్రామంలో గల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా దాహార్తులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఉచితంగా చల్లని నీరు అందించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో అనిల్, రజనీకాంత్, మోహన్, పవన్, సురేష్, కిరణ్, మధు కుమార్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు,గ్రామ పెద్దలు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.






# దేవాలయం లో పూజలు చేసిన జహీరాబాద్ సివిల్ కోర్ట్ జడ్జ్



(ఝరాసంగం:

జహీరాబాద్ సివిల్ కోర్ట్ సీనియర్ జడ్జ్ గంట కవితా దేవి గురువారం దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయం, దత్తగిరి మహారాజ్ ఆశ్రమం ను సందర్శించారు. బర్దిపూర్ శ్రీ దత్తగిరి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ రాజగోపురం వద్ద వైదిక పాఠశాల విద్యార్థులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. జ్యోతిర్లింగాలు, దత్తాత్రేయ స్వామి, పంచవృక్షాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 29న శనైశ్వర స్వామి జయంతి కరపత్రాన్ని విడుదల చేశారు. వారికి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్, మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు.

# మత-పిచ్చి ఏ దేశాన్ని అయినా వినాశన- చేస్తుంది

**మతం ఏదైనా.....మతం చేసే అరాచకం దేశాన్ని రాతియుగం వైపు తీసుకుని వెళ్తుంది.**

మత పిచ్చి ఉన్నా ఏ దేశం బాగుపడదు, మనుషుల్ని మనుషులుగా చూడని సమాజం (కులాలను విభజన చేసి రాజకీయ ప్రయోజనం పొందే ఏ పార్టీ ఆయా దేశాలను మంచిది కాదు) మత పిచ్చితో దేశ యువతను చిత్తు చేస్తుంది. (కానీ రాజకీయ నాయకుల పిల్లలు ఈ ఉచ్చులో ఉండరు వారు వ్యాపారులు ఉద్యోగాలు చేస్తూ లక్షల కోట్లు సంపాదిస్తూ ఉంటారు)నా మత%శీ% మాత్రమే గొప్ప అనే ప్రతి మనిషి ఇలాంటి సంఘటనలు చూసి సిగ్గు పడాలి. దేవుడు అనేది అందరికి వ్యక్తిగతం ఎవరికి ఇష్టం ఉన్న దేవుణ్ణి వాళ్ళు పూజించుకునే హక్కు రాజ్యాంగం మనకు ఇచ్చింది. దేవుని పేరుతో అరాచకం అత్యంత ప్రమాదం, ఎవడి అవకాశం వాడిది. మద్యలో నలిగి బలై పోయేది ప్రజలే, మత పిచ్చి ఎదిగి ఉగ్రవాదంగా రూపాంతరం చెందుతుంది. ఇలాంటివి ఏ దేశానికి అయిన ప్రజలకయిన వారి భద్రతకు ఆటంకం కలిగించే ఎవరిని ఉపేక్షించరాదు. నరహంతక ముఠాను పోషించే ఎవర్ని క్షమించరాదు. బదులు తీర్చాల్సిందే అలాగే ప్రభుత్వాలు కూడా బాధ్యతగా ఉండాలి ప్రతి అవకాశాన్ని ఎన్నికల కోసమే ఉపయోగించి ప్రయోజనం పొందాలి అనుకుంటే దేశ అంతర్గత భద్రతకు తీరని నష్టం వాటిల్లుతుంది. ఎంతసేపు నెపం అవతలి వ్యక్తిపై వేసే కుట్రలు ఆపి ప్రభుత్వాలు ప్రజలకు ఎంత భరోసాను కల్పిస్తున్నాయి అనేది కూడా సూక్ష్మంగా ఆలోచించాలి. (ప్రస్తుత మన పెయిడ్ మీడియా చేసే అతి, పేక్ న్యూస్ ప్రచారాలే ఎక్కువ నమ్ముతున్నారు)

మొన్న.... ప్రవీణ్ పగడాల పాస్టర్ ని హత్య చేసింది కూడా మతమే..... మతం ఏదైనా ప్రమాదమే. దేశభవిష్యత్ ప్రజలకు కావాల్సింది.

నాణ్యమైన

1. విద్య
2. వైద్యం
3. ఉపాధి
4. సాంకేతికత (టెక్నాలజీ)
5. మౌలిక సదుపాయాలు

ఈ విషయాల్లో పాలకులు యువతను ఉన్నత లక్ష్యాల వైపు నడపాలి. యువతకు కావలసిన సదుపాయాలు కల్పిస్తూ మన పొరుగున ఉన్నా చైనా, ఇశ్రాయేలు, అమెరికాలి ఆయా దేశాలతో అభివృద్ధిలో పోటీ పడేలా ముందుకు నడపాలి కానీ మతం వైపు నడిపితే చివరికి మిగిలేది ఈ నేలపై రక్తం శవాలదిబ్బే ఇశ్రాయేల్ - గాజా దేశాల మధ్య కూడా (ఇస్లాం - క్రిస్టియన్) మత పిచ్చి వల్ల రెండు సంవత్సరాల నుండి ప్రాణ ఆస్తి నష్టాలు జరుగుతున్నాయి. మత పిచ్చి వల్ల ఆఫ్ఘనిస్తాన్ పరిస్థితి ఎంత దిగజారి పోయిందో మనం గుర్తుకు తెచ్చుకోవాలి.

బీబీపేట్ కె రాజు స్వేరో

# పదవ తరగతి ఫలితాలలో నంద్యాల పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ మూడో బ్రాంచి విద్యార్థుల ప్రభంజనం.





నంద్యాల
నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్ పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనపర్చిన మా విద్యార్థులు. 1. ఎల్ ద్వారకామృత 592/600.2. బి ప్రణీత రెడ్డి 589/600.3. ఆర్ సహస్ర 582/600.4. బాలాజీ 580/600.
550 మార్కులకు పైగా23
500 మార్కులకు పైగా43విద్యార్థులు విజయం సాధించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఏజీఎం సురేష్ గారు పాల్గొని గడిచిన సంవత్సరాలనుండి ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అధిక మార్కులు సాధిస్తూ రావడం అభినందనీయం అని తెలిపారు. అనంతరం ఆర్ఐ కోటయ్య చౌదరి గారు మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించుటకు కారణం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం, అలాగే మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక రూపొందించుకొని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేటట్లుగా బోధించడమే అని తెలిపారు.

ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మౌలా బిబి మేడం గారు అభినందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు విద్యార్థుల ఫలితాలకు కృషిచేసిన డీన్ షాలు, కోఆర్డినేటర్ గోవింద్ గారిని, ఏవో రాఘవేంద్ర గారిని,ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం సురేష్ గారు, ఆర్ ఐ కోటయ్య చౌదరి గారు, ప్రిన్సిపాల్ మాలా బీబీ మేడం గారు, డీన్ షాలు, కోఆర్డినేటర్ గోవింద్ గారు, ఏవో రాఘవేంద్ర,ప్రైమరీ ప్రీ ప్రైమరీ ఇన్చార్జులు భువనేశ్వరి,లక్ష్మీదేవి పద్మావతి మేడం గారు ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయండి.

## జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్

నంద్యాల
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చెందితేనే దేశం అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటుందని ఈ మేరకు సంబంధిత అధికారులందరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో 32వ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ బిల్లు 1992 వచ్చినందున జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే దేశం అగ్రగామిగా నిలుస్తోందని ఇందుకు సంబంధిత అధికారులందరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేసిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్




డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డి ఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిపిఓ జమీఉల్లా, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్టేట్ రెండవ ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఎమ్మెల్యే మాణిక్ రావు సన్మానం



(జహీరాబాద్
జహీరాబాద్ మండల పరధిలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ – హుమెర కుమారుడుషేక్ అద్నాన్ సమీ ఇటీవలే విడుదలిన ఇంటర్మీడియట్ ప్రధమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎం పి సీ ది 470 మార్కులకు 467 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన సందర్భంగా సన్మానం చేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన శాసనసభ్యులు కోనింటి మాణిక్ రావు,మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మాజి సర్పంచ్ చిన్న రెడ్డి,యువ నాయకులు మిథున్ రాజ్,గ్వాస్ తదితరులు పాల్గొన్నారు.





# ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

(జహీరాబాద్
కాశ్మీర్ లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులకు నిరసనగా బుధవారం రోజున యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ళ.నాగిరెడ్డి గారీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి,ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్దం చెయ్యడం జరిగింది.అనంతరం ఉగ్రవాదుల దాడులలో 26 మంది మృతి చెందిన వారికి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి,సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వసీం,నరేష్ బబ్లూ,జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ రెడ్డి,మల్లికార్జున్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముజామిల్, సుభాష్ యాదవ్,సునీల్ కుమార్,జహీరాబాద్ అసెంబ్లీ కమిటీ ప్రధాన కార్యదర్శులు మోహీన్,యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ మిత్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# ఎమ్మెల్యే మాణిక్ రావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

(జహీరాబాద్ ,
జహీరాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు కొనింటి మానిక్ రావు దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణలి ,ఝురాసంఘం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడం పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి ,తాజా మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, విజయ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్,బాబు మియ తదితరులు పాల్గొన్నారు



# కిరణ్ కుమార్ ను సన్మానం చేసిన పెద్దాపురం దుర్గయ్య



సంగారెడ్డి)
ఇటీవల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ ప్రముఖ వైద్యులు, సివిల్ సర్జన్, డాక్టర్ కిరణ్ కుమార్ ను ఎస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా పక్షాన చరిత హాస్పిటల్ సంగారెడ్డలో శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా దుర్గయ్య మాట్లాడుతూ అనేక సంవత్సరాలనుండి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తు సమాజానికి మేలు చేస్తున్నారన్నారు. అర్హతలు, అనుభవం ఉన్న డాక్టర్ కిరణ్ కుమార్ కు ఐ ఎం ఏ జిల్లా అధ్యక్ష పదవి వరించడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో ఇంకా మరిన్ని వైద్య సేవలు అందించి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించి గొప్ప స్థాయిలో ఉండాలని కోరారు. డాక్టర్స్ సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించే ప్రయత్నం చేయాలనీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మునిపల్లి మండల సంఘం గౌరవ అధ్యక్షులు సాయిబాబా, బాలయ్య లు పాల్గొన్నారు.

# 11వ సారి రక్తదానం చేసిన జగదీష్ చంద్రబోస్

## - దామర్ గిద్ధ ముద్దు బిడ్డకు అభినందనలు తెలిపిన గ్రామ ప్రజలు



నాగలి గిద్ద)
నాగల్ గిద్ధ మండల పరిధిలోని శేరి దామర్ గిద్ధ గ్రామానికి చెందిన జగదీష్ చంద్రబోస్ హైదారాబాద్ లో ఓ ప్రవేట్ కంపనిలో విధులు నిర్వహిస్తూ 11వ సారి రక్తదానం చేసిన ఆపద్బాంధవుడు. జగదీష్ చంద్రబోస్ పెన్ గన్ న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వారు అత్యవసర సమయంలో రక్తం అవసరం అని ఫోన్ చేయడంతో వెను వెంటనే స్పందించి రక్తదానం చేయడం జరిగింది అన్నారు. రోడ్డు ప్రమాధలో కానీ ఏ ప్రమాదంలో రక్తం అవసరం కాబట్టి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని జగదీష్ చంద్రబోస్ లక్ష్యంతో నేడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. జగదీష్ చంద్రబోస్ కు గ్రామ ప్రజలు, ఎంపీటీసీ శేరికర్ పండరి, పట్లోళ్ల వెంకట్ రెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి, చింతల్ మారుతి,మట్లకుంటే బస్వరాజు,బద్రినాథ్, మలిపటేల్ ధనరాజ్ పటేల్, పెన్ గన్ న్యూస్ రిపోర్టర్ లక్ష్మణ్ తదితరులు అభినందనలు తెలిపారు.

# ఎం ఈ ఓ కార్యాలయం ను ప్రారంభించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి,ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి



నాగలి గిద్ద)
నాగల్ గిద్ధ మండల కేంద్రములో నూతన మండల విద్య అధికార కార్యాలయాన్ని రిబ్బేన్ కటింగ్ చేసి ప్రారంభం చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి,ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్ రెడ్డి, మండల విద్య అధికారి మన్మధ కిషోర్. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హ్యాచ్ యం:శంకర్,కరముంగీ జిల్లా ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, పి ఆర్ టి యు టిఎస్ నాగల్ గిద్ధ మండల అధ్యక్షులు శేరికర్ రమేష్,నాగునత్,రమేష్,నర్సింలు, సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు గుండెరావు పటేల్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా విజయవంతం

(సదాశివ పేట్
సదాశివపేట పట్టణంలోని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు గారు అన్నారు. ఇంటర్ డిగ్రీ పిజి ఇలా పై చదువులు పూర్తి చేసుకున్నటువంటి విద్యార్థులు ఎందరో నిరుద్యోగంతో బాధపడుతున్న తరుణంలో.... కంపెనీ వారిని సంప్రదించి ఈరోజు కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.



వారి చదువుకు తగినటువంటి ఉద్యోగంలో పదుల సంఖ్యలో సెలెక్ట్ అయ్యారు. ఈ ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగం సాధించినటువంటి నిరుద్యోగ విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. తదుపరి జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్నటువంటి కంపెనీ వారికి కళాశాల యాజమాన్యం తరపున శాలువాతో సన్మానం చేసి మేమేంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరవిందరావు , నర్సింలు, ప్రవీణ్ కుమార్, సతీశ్ కుమార్, రవీందర్, మహేష్ సౌజన్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అక్షయను అభినందించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.



(పటాన్ చేరు ,
పటాన్చెరువు మండలం ముత్తంగి లోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి పూర్తిచేసి ఇటీవల విడుదలైన ఫలితాలలో 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించి టాపర్ గా నిలిచిన మంగలి అక్షయను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం అభినందించారు. సంగారెడ్డిలో నిరుపేద కుటుంబానికి చెందిన మంగలి పద్మ శ్రీశైలం దంపతుల అక్షయ ఇంటర్ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్షయను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అభినందించి స్వీట్లు తినిపించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అక్షయకు కలెక్టర్/ డాక్టర్ కావాలని సూచించారు. ఈ సందర్భంగా అక్షయ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 977 మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు తనకు ఈ మార్కులు రావడానికి లెక్చరర్లు, ప్రిన్సిపల్ కృషి చేసినట్లు తెలిపారు. ఇంటి కి దూరంగా ఉన్న పట్టుదలతో చదువుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో డాక్టర్ కావాలని అనుకుంటున్నాట్లు ఎంబిబిఎస్ చదవడానికి ప్రభుత్వం కూడా సహకరిస్తే తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, కార్యదర్శి శ్రీశైలం యువత ప్రధాన కార్యదర్శి రాము యువత అధ్యక్షుడు ఆంజనేయులు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.